ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
ఆదివారం 30 జూన్ 2024



పెనుమాక నుంచే.. పింఛన్ల పండుగ

- స్వయంగా హాజరు కానున్న సీఎం చంద్రబాబు
- రేపు ఉదయం 6 గంటలకు లబ్ధిదారులకు నేరుగా పంపిణీ
- అనంతరం గ్రామంలో లబ్ధిదారులతో చంద్రబాబు ముఖాముఖీ
- గ్రామంలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ నాగలక్ష్మి, అధికారులు



సీఎం పర్యటన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలో చెప్పినట్లుగా కూటమి ప్రభుత్వం సామాజిక పింఛన్ల పంపిణీకి సిద్ధమైంది. పింఛన్ల పండుగను గుంటూరు జిల్లా నుంచే ప్రారంభించను న్నారు. ఇంటింటికీ రూ.7 వేలను నేరుగా లబ్ధిదారులకు సచివాలయ ఉద్యోగులు అందజేయాల ని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అమరావతి రాజధాని పరిధిలోని తాడేపల్లి మండలం పెనుమాక నుంచి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జూలై 1వ తేదీ సోమవారం తెల తెలవారుతుండగానే సీఎం చంద్రబాబు స్వయంగా పెనుమాకలోని లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లను పంపిణీ చేయను న్నారు. పింఛన్‌దారుల కళ్లల్లో ఆనందం స్వయంగా చూసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యమంత్రి స్వయంగా ఒక గ్రామంలో సామాజిక పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడం రాష్ట్ర చరిత్రలో ఇదే మొదటిసారి. పింఛన్ల పంపిణీని లాంఛనంగా ప్రారంభించిన అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్‌దారులను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. స్వయంగా ముఖ్యమంత్రి పెన్షన్ల కార్యక్రమంలో పాల్గొంటారని తెలియడంతో గ్రామంలో సందడి నెలకొంది. అధికారులు, పోలీసులు బందో బస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం కలెక్టర్ నాగలక్ష్మి మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్, డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి తదితరులు గ్రామంలో చంద్రబాబు పింఛన్లు అందజేసే ప్రాంతాన్ని పరిశీలించి ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు.



సీఎం రాక కోసం రహదారికి మరమ్మతులు

వైసీపీ మోసం.. చెప్పినట్లు చేస్తోన్న టీడీపీ

సార్వత్రిక ఎన్నికల్లో పింఛన్ల పెంపు హామీ ఒక గేమ్ ఛేంజర్‌గా మారింది. గత వైసీపీ ప్రభుత్వం 2019లో అధికారంలోకి రాకముందు పింఛన్‌ని రూ.3 వేలకు పెంచుతామని చెప్పి రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్‌దారులను మోసగించింది. ఏడాదికి రూ.250 చొప్పున పెంచడంతో అవి వారికి ఏమాత్రం అక్కరకు రాలేకపోయాయి. దాని వల్ల పింఛన్‌దారులు తీవ్ర నిరాశకు గురయ్యారు. తమని మోసగించిన జగన్‌కి తగిన బుద్ధి చెప్పేందుకు ఎప్పుడెప్పుడు అవకాశం వస్తుందా అని ఐదేళ్లు ఎదురు చూశారు. కాగా చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలలో భాగంగా పింఛన్‌ని రూ.4 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తొలి నెల నుంచే పెంచిన పింఛన్ ఇస్తామని ఎన్నికల ప్రచారంలో చెప్పారు. ఎన్నికల సమయంలో పెన్షన్ల పంపిణీ సక్రమంగా చేయకుండా వైసీపీ ప్రభుత్వం చేసిన ఇబ్బందులు చూసి ఏప్రిల్ నెల నుంచే పింఛన్ పెంచుతానని, దానిని జూలై నెల ఒకటో తేదీన ఇస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు ప్రస్తుత నెల రూ.4 వేలు, ఏప్రిల్ నుంచి రూ.వెయ్యి చొప్పున మూడు నెలలకు కలిపి రూ.3 వేలు మొత్తంగా రూ.7 వేలు పంపిణీకి చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆదేశాలు ఇచ్చారు. ఆ మేరకు శనివారం బ్యాంకుల నుంచి సచివాలయాల సిబ్బంది నగదు డ్రా చేశారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

పెనుమాకలో సోమవారం ఉదయం 6 గంటలకు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొంటున్నందున అధికారులందరూ సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. సీఎం పర్యటన ఏర్పాట్లపై కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో శనివారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పింఛన్ల పంపిణీ అనంతరం జరిగే ప్రజా వేదిక కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులు, ప్రజలతో చంద్రబాబు ముఖాముఖీ మాట్లాడతారన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీరు అందుబాటులో ఉంచాలని, పారిశుధ్య ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జేసీ రాజకుమారి, తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్, డీఆర్‌వో పెద్ది రోజ, గుంటూరు ఆర్‌డీవో పీ.శ్రీఖర్, పీడీ డీఆర్‌డీఏ హరిహరనాథ్, సిపిఓ శేషశ్రీ, డిఈఓ శైలజ, డీఎస్‌వో కోమలి పద్మ పాల్గొన్నారు.



- అడ్డగోలు ఉత్తర్వులతో జీతాలు
- అర్హత లేకపోయినా కీలక బాధ్యతలు
- సొంతవారికి ఇష్టారీతిన ఉద్యోగోన్నతులు
- అవుట్‌సోర్సింగ్ నియామకాలతో వసూళ్లు

దేవదాయం.. దోపిడీ

ఆధ్యాత్మకంగా ఉంటూ.. హిందూ ధర్మ ప్రచారంతో పాటు.. ఆలయాల అభివృద్ధి.. భక్తులకు సౌకర్యాలు కల్పించాల్సిన.. దేవదాయశాఖ అధికారులు కొందరు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. దేవదాయ శాఖను దోపిడీకి కేంద్రంగా మార్చుకున్నారన్న ఆరోపణలున్నాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో సొంత అజెండాతో ప్రభుత్వం చెలరేగగా.. తామేమీ తీసిపోమన్నట్లుగా దేవదాయశాఖలోని కొందరు అధికారులు అదేబాట పట్టారు. అడ్డగోలు ఉత్తర్వులు.. ఇష్టం వచ్చిన ట్లు నిధులు డ్రా.. ఒక పద్ధతి లేకుండా ఉద్యోగోన్నతులు.. అర్హత లేకపోయినా కీలక బాధ్యతలతో కొందరు అధికారులు దేవదాయ శాఖలో పెత్తనం సాగించారు. గడిచిన 5 ఏళ్లుగా గుంటూరు జిల్లా దేవదాయ శాఖలో కొందరు అధికారులు తిష్ట వేసి భారీగా అవినీతి అక్రమా లకు పాల్పడ్డారన్న ఆరోపణలు సొంతశాఖలోని ఉద్యోగుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. ఓ కీలక అధికారి తన అనుయాయులను వెంటేసుకుని ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలో పెత్తనం చెలయిస్తూ ప్రతీ పనికి ఒక రేటు నిర్ణయించి అందని కాడికి దోచుకున్నారని సమాచారం.



గుంటూరులోని దేవదాయ శాఖ కార్యాలయం

గుంటూరు(కార్పొరేషన్), జూన్ 29: అడ్డగోలు ఉద్యోగోన్నతులు, అక్రమాలకు గుంటూరు దేవదాయశాఖ కేంద్రంగా మా రింది. అసిస్టెంట్ కమిషనర్ క్యాడర్‌లో ఉన్న ఓ అధికారి ఉద్యో గోన్నతిపై విమర్శలున్నాయి. 2019లో వైసీపీ అధికారం చేపట్టిన తర్వాత అక్రమ ఉద్యోగోన్నతులు జరిగాయి. అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న ఓ అధికారి ఎటువంటి అదనపు బాధ్యతలు లేకుండానే నేరుగా ఉద్యోగోన్నతి పొందారు. రాష్ట్ర స్థాయి అధికారులు అప్పట్లో ఇచ్చిన ఈ ఉత్తర్వులపై అభ్యంతరాలు వ్యక్తం చేసినా పట్టించుకునే వారు లేకుండా పోయారు. దీంతో కీలక పోస్టులోకి వెళ్లిన ఆ అధికారి ఐదేళ్లపాటు దేవదాయ శాఖను దోచుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అక్రమంగా బాధ్యతలు చేపట్టి ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలో అన్ని గ్రూపు దేవాలయాలపై పెత్తనం చేస్తూ పెద్దఎత్తున అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. తన అనుయాయుడైన ఓ అధికారిని కార్యాలయంలో కీలక పోస్టులో నియమించుకుని అడ్డగోలుగా దోచేశారని తెలిసింది. ట్రెజరీ నుంచి కూడా జీతాలు డ్రా చేశారన్న ఆరోపణలున్నాయి. కనీసం ట్రెజరీ అధికారులు కూడా ఈ విషయాన్ని గుర్తించకుండా జీతాలు కట్టబెట్టారని కొందరు ఉద్యోగులు తెలిపారు. అడ్డగోలుగా తాను కీలక బాధ్యతలు నిర్వహించడమే కాకుండా తన పరిధిలో ఉన్న అధికారం వినియోగించుకుని అనేక అక్రమాలకు పాల్పడ్డారన్న విమర్శలున్నాయి. ఉద్యోగోన్నతి పేరుతో గుంటూరు జిల్లాలో ఓ డివిజన్‌లో పనిచేస్తున్న ఓ ఉద్యోగి నుంచి రూ.2 లక్షలు తీసుకున్నట్లు సమాచారం. సీనియర్లను కాదని జూనియర్ అయిన మరో ఉద్యోగికి నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగోన్నతి కల్పించి రూ.3 లక్షల తీసుకున్నట్లు ఆరోపణన్నాయి. ఇలా దేవదాయశాఖ పరిధిలోని మూడు జిల్లాల్లో సుమారు 200 మంది ఉద్యోగులకు అక్రమంగా ఉద్యోగోన్నతులు ఇచ్చి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రత్యేక సిబ్బంది కావాలంటూ అవుట్‌సోర్సింగ్ విధానంలో అనేకమందిని నియమించుకుని వారి వద్ద పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. ఇలా దేవదాయ శాఖలో ఐదేళ్లుగా ఆ అధికారి అడ్డగోలుగా దోపిడీకి పాల్పడ్డారని ఆ శాఖ ఉద్యోగులే ఆరోపిస్తున్నారు. తనిఖీల పేరుతో ప్రతీ ఆలయానికి వెళ్లడం రూ.వేలల్లో డిమాండ్ చేసి వసూలు చేయడం ఓ ఆనవాయితీగా ఆ అధికారి చేసుకున్నట్లు విమర్శలున్నాయి. ప్రతీ ఏడాది బడ్జెట్ ఆమోదించాల్సి ఉండగా దానికి కూడా ఓ రేటు పెట్టి.. ఆ ప్రకారం డబ్బులు వసూలు చేశారని తెలిసింది. దీంతో మూడు జిల్లాల్లోని ఆలయాల్లో పనిచేసే ఈవోలు, మేనేజర్లు బెంబేలెత్తి పోయారని తెలిసింది. ఎప్పుడు వచ్చి తమపై పడతారు.. ఎంత డిమాండ్ చేస్తారో అంటూ ఉద్యోగులు హడలెత్తేవారంటే ఆశ్చర్యం కాదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ అధికారి ఇటీవల వరకు చేసిన అక్రమాలు, అవినీతి తాజాగా వెలుగులోకి వస్తున్నాయి. అయితే ఆరు నెలల క్రితం జరిగిన బదిలీల్లో ఆ అధికారి తిరిగి పాత పోస్టులోనే వేరే జిల్లాకు వెళ్లారని సమాచారం.



- రోగుల చికిత్సలపై మంత్రి పెమ్మసానికి వివరిస్తున్న వైద్యురాలు

ప్రభుత్వాస్పత్రిలో నిర్మాణాలపై.. విజిలెన్స్ విచారణ

- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని ఆదేశాలు
- ఏళ్ల తరబడి నిర్మాణాలు జరగడం పట్ల విస్మయం
- శాసన సభ్యులతో కలసి జీజీహెచ్‌లో తనిఖీలు

6లో..

విద్యార్థుల ఆందోళన.. వీసీ రాజీనామా

- ఛాంబర్‌కు తాళంతో దిగొచ్చిన రాజశేఖర్
- ఏఎన్‌యూలో ఐదేళ్ల అరాచక పాలనకు విముక్తి



వీసీ చాంబర్ ఎదుట ఆందోళన చేస్తున్న టీఎన్ఎస్ఎఫ్, జనసేన విద్యార్థి సంఘాల నాయకులు

పెదకాకాని, జూన్ 29: వైసీపీతో అంటకాగి.. వైసీపీ సేవలో తరించి.. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వీసీగా ఆచార్య రాజశేఖర్ తీరుపై విమర్శలు, ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో శనివారం టీఎన్ఎస్ఎఫ్, జనసేన విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టాయి. ఆయా విద్యార్థులు వర్సిటీలో ర్యాలీ చేసి అనంతరం వీసీ ఛాంబర్‌కు తాళాలు వేసి ధర్నా చేశాయి. రాష్ట్రంలో అన్ని విశ్వవిద్యాలయాల వీసీలు రాజీనామా చేశారని, కానీ నాగార్జున విశ్వవిద్యాలయం వీసీ మాత్రం రాజీనామా చేయలేదని మండిపడ్డారు. వర్సిటీలో పెద్దఎత్తున దోపిడీలు చేసి, వైసీపీకి అనుకూలంగా వ్యవహరించిన రాజశేఖర్‌కు వీసీగా కొనసాగే అర్హత లేదన్నారు. వీసీని చాంబర్‌కు రానిచ్చే ప్రసక్తే లేదని తెలిపారు. ఈ విషయం తెలిసిన వీసీ రాజశేఖర్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన తన రాజీనామా లేఖను గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్‌నజీర్‌కు పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు నితీష్‌యాదవ్, నాయకులు భాగ్యరాజు, జనసేన అధ్యక్షుడు జగదీష్, నాయకులు శ్రీను, అవినాష్, రామకృష్ణ, యశ్వంత్, ఖాయూమ్, పవన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయంగా వర్సిటీ

2019 సెప్టెంబరులో విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉపకులపతిగా ఆచార్య రాజశేఖర్ నియమితులయ్యారు. 2022 సెప్టెంబరు 28 నుంచి రాజశేఖర్‌ను రెగ్యులర్ వీసీగా నియమించారు. ఈ క్రమంలో ఇన్‌చార్జి వీసీగా నియమితులైనప్పటి నుంచి ఆయన వైసీపీ ప్రభుత్వంతో అంటకాగి విశ్వవిద్యాలయాన్ని వైసీపీ కార్యాలయంగా మార్చారన్న విమర్శలున్నాయి. విద్యకు నిలయమైన విశ్వవిద్యాలయంలో అప్పటి సీఎం జగన్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిల పుట్టినరోజు నిర్వహించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ విగ్రహాన్ని తొలుతగా ఏఎన్‌ఎల్‌లో ఏర్పాటు చేసి విశ్వవిద్యాలయాల్లో రాజకీయ నాయకుల విగ్రహాల ఏర్పాటుకు నాంది పలికారనే విమర్శలు మూటగట్టుకున్నారు. తన అనుచరులందరికీ అతిథి అధ్యాపక ఉద్యోగాలతో పాటు ప్రోగ్రామర్ తదితర ఉద్యోగాలు ఇచ్చారనే ఆరోపణలున్నాయి. పాలకమండలి ఆమోదం లేకుండానే వర్సిటీ డిపాజిట్లు రూ.కోట్లలో దుర్వినియోగం చేశారనే ఆరోపణలు వచ్చాయి. బూటకపు ఇంటర్వ్యూలు నిర్వహించి నలుగురు దళిత, బీసీ వర్గాలకు చెందిన అతిథి అధ్యాపకుల పొట్ట కొట్టారన్న విమర్శలు ఉన్నాయి. గత ప్రభుత్వం ప్రకటించిన మూడు రాజధానులకు మద్దతుగా వర్సిటీలో వీసీ ప్రత్యేకంగా సదస్సులు, సెమినార్లు నిర్వహించారు. మూడు రాజధానులపై ఓ పుస్తకం కూడా ముద్రించారు. వైసీపీ ప్లీనరీ సమావేశాల సందర్భంగా వర్సిటీలో పరీక్షలను వాయిదా వేసి ప్రాంగణాన్ని వైసీపీ వారి వాహనాలకు పార్కింగ్ స్థలంగా ఇచ్చారు. ఈ క్రమంలో శనివారం ఆయన రాజీనామాతో వర్సిటీలో ఐదేళ్ల అరాచక పాలనకు ముగింపు పలికినట్లుగా విద్యార్థులు, అధ్యాపకులు భావిస్తున్నారు.

ఇదేంటిలా?

- ఆ ముగ్గురు సీఐల పోస్టింగ్స్‌తో పోలీసు శాఖలో కలకలం
- నాడు వైసీపీతో అంటకాగిన ఖాకీలు
- వారికే కీలక స్థానాల్లో పోస్టింగులు
- పోలీస్ శాఖలో ఏం జరుగుతోంది?
- ఉలిక్కిపడిన తెలుగు తమ్ముళ్లు



గుంటూరు, జూన్ 29: గడిచిన ఐదేళ్ల అధికార వైసీపీ వేధింపులకు, అరాచకాలకు బలైన ఎంతోమంది ఖాకీలకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే న్యాయం జరుగుతుందని అంతా భావించారు. ఐదేళ్లపాటు ఓ వర్గాన్ని కనిపించకుండా చేశారు. కొందరిని సస్పెండ్ చేయగా, మరికొందరిని వీఆర్ పేరుతో కనీసం జీతాలు కూడా లేకుండా చేశారు. టీడీపీకి అనుకూలంగా ఉంటారని భావించిన అనేకమంది పోలీస్ అధికారులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారు. ఈ పరిస్థితుల్లో తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఎన్నికల సందర్భంగా జరిగిన ప్రచార సభల్లో తమ పార్టీ అధికారంలోకి వస్తే బాధితులందరికీ న్యాయం చేస్తామని నాయకులు చెప్పారు. గడిచిన ఐదేళ్లలో ఎవరైతే ఇబ్బందులు ఎదుర్కొన్నారో వారందరికీ న్యాయం చేస్తామని, కీలక స్థానాల్లో పోస్టింగ్ ఇస్తామని పదేపదే ప్రకటించారు. అనుకున్నట్లుగానే కూటమి ప్రభుత్వం భారీ మెజార్టీతో అధికారంలోకి వచ్చింది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు నెలరోజులు సమీపిస్తున్న తరుణంలో ముఖ్యంగా పోలీస్‌శాఖలో చోటు చేసుకుంటున్న పరిణామాలు పోలీస్ శాఖను విస్మయానికి గురిచేయగా, తెలుగు తమ్ముళ్లను ఉలికిపాటుకు గురిచేశాయి.

గడిచిన వారం రోజుల్లో కేవలం ముగ్గురు సీఐలకు పోస్టింగ్స్ వచ్చాయి. తొలుత మంగళగిరి రూరల్ సీఐగా వై.శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఆయనకు ఏ ప్రాతిపదికన పోస్టింగ్ వచ్చిందనేది బాధిత పోలీసు అధికారులకే గాక స్థానిక పార్టీ శ్రేణులకు కూడా అర్థం కాని పరిస్థితి. ఆ తర్వాత రోజు మంగళగిరి టౌన్ సీఐగా డి.వినోద్‌కుమార్‌ను నియమించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎస్‌ఐగా మంగళగిరి టౌన్, మంగళగిరి రూరల్, తాడేపల్లి స్టేషన్‌లో విధులు నిర్వహించిన వినోద్ అప్పటి మంగళగిరి ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితునిగా ముద్రపడ్డారు. అదే సమయంలో టీడీపీ శ్రేణులను ఇబ్బందులకు గురిచేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. తాజాగా తుళ్లూరు సీఐగా మాతంగి శ్రీనివాసరావును నియమించడం పార్టీ వర్గాల్లో కలకలం రేగింది. గత ప్రభుత్వంలో మాతంగి శ్రీనివాసరావు కొంతకాలం గుంటూరు నగరంలోని ఈస్ట్ ట్రాఫిక్ సీఐగా విధులు నిర్వహించారు. ఆ తర్వాత లాలాపేట సీఐగా పనిచేశారు. ఆ సమయంలో ఓ ఎమ్మెల్యే బంధువులు డ్రగ్స్ కేసులో ఇరుక్కోగా వారిని తప్పించారన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో ఆయనను సస్పెండ్ చేయకుండా అప్పటి అధికార పార్టీ పెద్దల ఒత్తిడి మేరకు వీఆర్‌కు పంపారని సమాచారం. ఇక్కడ నుంచి నేరుగా ఆయనను ప్రకాశం జిల్లా కొండేపి సీఐగా నియమించారు. అక్కడ తెలుగుదేశం పార్టీ సమావేశం పెట్టినప్పుడు ఇతను వెళ్లి పార్టీ జెండాలు పీకేసి, సభావేదికను తొలగించినట్లు సోషల్ మీడియాలో టీడీపీ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్కడ సభ జరగకుండా చేసి కార్యకర్తలను తీవ్రంగా కొట్టాడని అటువంటి సీఐకే పోస్టింగ్ ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మాతంగి శ్రీనివాసరావును స్థానిక ఎమ్మెల్యే పట్టుపట్టి మరీ తుళ్లూరు సీఐగా తెచ్చుకున్నట్లు పోలీస్, పార్టీవర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఎమ్మెల్యే అత్తగారి ఊరికి చెందినవాడు కావడంతోనే శ్రీనివాసరావుకు కీలకమైన పోస్టింగ్ లభించినట్లు ఆయా వర్గాలు అంటున్నాయి. తెలుగుదేశం పార్టీలోని కీలక నాయకులు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలాగా, అధికారంలోకి వచ్చాక మరోలాగా వ్యవహరిస్తున్నారంటూ కార్యకర్తలు మండిపడుతున్నారు.

లోక్ అదాలత్‌లో 1454 కేసుల పరిష్కారం

గుంటూరు (లీగల్), జూన్ 29: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై వీఎస్‌బీజీ పార్థసారధి ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని కోర్టులలో శనివారం జాతీయ లోక్ అదాలత్‌లు జరిగాయి. ఈ లోక్ అదాలత్‌లలో న్యాయ స్థానాల్లో పెండింగ్‌లో ఉన్న 1454 రాజీ పడదగిన కేసులను పరిష్కరించినట్లు న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలావతి తెలిపారు. సివిల్ కేసులు 166, క్రిమినల్ కేసులు 708, చెక్‌బౌన్స్ కేసులు 202, మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు 152, వివాహ సంబంధ కేసులు 80, బ్యాంకు కేసులు 6, ప్రీ-లిటిగేషన్ కేసులు 140 రాజీమార్గంలో పరిష్కరించినట్లు చెప్పారు. ఈ కేసుల పరిష్కారం ద్వారా రూ.38 కోట్ల 24లక్షల 12వేల 474 మేరకు వాటిలోని కక్షిదారులకు లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు.

గుంటూరు - బెంగళూరు ఇంటర్ సిటీకి పెమ్మసాని ప్రతిపాదన

6లో..

డీజీపీని కలసిన ఎంపీ రాయలు


డీజీపీతో ఎంపీ లావు, మక్కెన, జిలాని

నరసరావుపేట, జూన్ 29: రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావును టీడీపీ పార్లమెంటరీ పార్టీనేత లావు శ్రీకృష్ణ దేవరాయలు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో ద్వారకా తిరుమలరావుని కలసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పల్నాడులోని ముఖ్యమైన అంశాలపై చర్చించారు. ఎంపీ వెంట మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, నరసరావుపేట నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ సయ్యద్ జిలాని ఉన్నారు

ప్రభుత్వాస్పత్రిలో నిర్మాణాలపై.. విజిలెన్స్ విచారణ


ప్రభుత్వ ఆస్పత్రిలో పర్యటిస్తున్న పెమ్మసాని, నసీర్ అహ్మద్, రామాంజనేయులు, కలెక్టర్

- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని ఆదేశాలు
- ఏళ్ల తరబడి నిర్మాణాలు జరగడం పట్ల విస్మయం
- శాసన సభ్యులతో కలసి జీజీహెచ్‌లో తనిఖీలు

గుంటూరు (మెడికల్), జూన్ 29: 'గుంటూరు ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలో జరుగుతున్న భవన నిర్మాణాల కాంట్రాక్ట్‌లపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖతో విచారణ జరిపించి ఏ స్థాయిలో తప్పు జరిగినా వెలికి తీయాలని' కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్‌ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, కలెక్టర్ నాగలక్ష్మీ సెల్వరాజన్‌ను ఆదేశించారు. శనివారం ప్రభుత్వాస్పత్రిలో కలెక్టర్ నాగలక్ష్మీ సెల్వరాజన్, శాసన సభ్యులు మహ్మద్ నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణకుమార్‌లతో కలసి ఆయన పర్యటించారు. పలు వార్డులను సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రాంగణంలో గత ఏడేళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయిన విజిటర్స్ వెయిటింగ్ హాల్‌ను పరిశీలించిన మంత్రి పెమ్మసాని, ఇన్నేళ్లుగా ఆ భవన నిర్మాణం పూర్తి కాకపోవడం పట్ల విస్మయం వ్యక్తం చేశారు. అప్పటి డీపీఆర్‌లకు అనువుగా నిధులు విడుదలైనా ఇప్పటికీ పనులు పూర్తి కాకపోవడం ఏమిటని? సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్‌ను నిలదీశారు. దీనికి సరైన సమాధానం ఇవ్వలేకపోవడంతో ..ఈ నిర్మాణాల కాంట్రాక్టర్‌పై విజిలెన్స్ విచారణ జరపాలని మంత్రి పెమ్మసాని ఆదేశించారు. తప్పు చేసింది నిజమైతే కఠిన చర్యలు తీసుకోవాలని, ఏ స్థాయిలో తప్పు జరిగిందో వెలికి తీయాలని ఆయన స్పష్టం చేశారు. త్వరలో హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీని ఏర్పాటు చేయాలని సొసైటీ ఛైర్‌పర్సన్, కలెక్టర్ నాగలక్ష్మీకి కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సూచించారు.

ప్రభుత్వ వైద్యులు బాధ్యతాయుతంగా పనిచేయాలి...

గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వైద్యులు బాధ్యతాయుతంగా పనిచేయాలని పెమ్మసాని చంద్రశేఖర్ కోరారు. ఆసుపత్రిలో అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యల పరిష్కారం కోసం స్థానిక శాసనసభ్యులను సమన్వయం చేసుకొని ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని ఆయన ప్రకటించారు అనంతరం నాట్కో కేన్సర్ విభాగంలోని సెమినార్ హాల్‌లో వైద్యాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రికి సంబంధించిన ప్రాథమిక వివరాలు, వైద్య విభాగాలు, రోగులకు అందిస్తున్న సేవలు, మౌలిక సౌకర్యాలు, అభివృద్ధి పనులు, జింకానా, నాట్కో ట్రస్ట్ ద్వారా అందిస్తున్న వైద్యసేవలు, విభాగాలవారీగా పరిష్కరించాల్సిన సమస్యలను సూపరింటెండెంట్ డాక్టర్ వై కిరణ్‌కుమార్ తెలిపారు. సంబంధి వైద్య విభాగాధిపతులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా పెమ్మసానికి వివరించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ సీటీ స్కాన్ మెషిన్‌కు సంబంధిత ఏజెన్సీ ద్వారా తక్షణం మరమత్తులు చేయించాలని ఆదేశించారు. ఎమ్మెల్యేలు నసీర్‌అహ్మద్, గళ్లా మాధవి, రామాంజనేయులు, తెనాలి శ్రావణ్‌కుమార్ పలు అంశాలపై సూచనలు అందిస్తూ కేంద్రీకృతంగా ఉన్న వైద్య పరికరాలు, ఇతర సేవల నిర్వహణను వికేంద్రీకరణకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ టీటీకే రెడ్డి, ఆర్‌డీ సీహెచ్ సుధారాణి, సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ బీ సతీష్ కుమార్, ఏపీ ఎంఎస్ఐడీసీ ఈఈ శ్రీధర్, అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు, జింకానా కోఆర్డినేటర్లు డాక్టర్ బాలభాస్కరరావు, డాక్టర్ పీవీ హనుమంతరావు, నాట్కో ట్రస్ట్ కోఆర్డినేటర్ అశోక్‌కుమార్, ప్రవీణ్ పాల్గొన్నారు.

బియ్యం బకాసురుల బండారం త్వరలోనే బట్టబయలు

- ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, జూన్ 29: రాష్ట్రంలో పేదల బియ్యం బొక్కేసి అడ్డదారుల్లో వేలకోట్లకు పడగలెత్తిన వైసీపీ బియ్యం బకాసురులందరి బండారం త్వరలోనే బట్టబయలు కావటం ఖాయమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. కొద్దిరోజులుగా పౌరసరఫరాలశాఖలో వెలుగుచూస్తున్న విస్తుపోయే వాస్తవాల నేపథ్యంలో శనివారం విడుదలచేసిన పత్రికాప్రకటనలో గడిచిన ఐదేళ్లలో ప్రతి నియోజకవర్గంలో చోటుచేసుకున్న రేషన్‌బియ్యం అక్రమాలన్నీ తవ్వితీయాల్సిన సమయం వచ్చిందన్నారు. కాకినాడ పోర్టు ద్వారా ఏఏ దేశాలకు ఎంతెంత దొంగతనంగా ఎగుమతులు చేశారు?, ఆ బియ్యం ఏఏ ప్రాంతాల నుంచి అక్కడికి ఎలా చేర్చారో మొత్తం వెలికితీస్తే సగంమంది వైసీపీ నేతలు ఊచలు లెక్కపెట్టడం ఖాయమన్నారు. మాజీ మంత్రి విడదల రజినిపై కూడా ఇదే విషయంలో తీవ్ర ఆరోపణలు వచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. పేదల బియ్యాన్ని దారి మళ్లించి మిల్లుల ద్వారా వేలకోట్లు వెనకేసుకున్న పెత్తందారులు, వారికి వెన్నుదన్నుగా నిలిచినవారిని చట్టం ముందు నిలబెట్టాల్సి ఉందన్నారు. చెప్పినమాట ప్రకారం తొలి ఐదు సంతకాల్లోనే పింఛన్‌ల పెంపునకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబును పేదలంతా గుండెల్లో పెట్టుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రం ఆర్థికకష్టాల్లో ఉండి ప్రతి నెల వందల కోట్ల భారం పడుతున్నా ఇచ్చినమాట ప్రకారం పింఛన్‌ను రూ.4వేలు చేసిన నిజమైన చాంపియన్ చంద్రబాబు అని ప్రత్తి పాటి కొనియాడారు.

గుంటూరు - బెంగళూరు ఇంటర్‌సిటీకి పెమ్మసాని ప్రతిపాదన

- విశాఖ - ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ గుంటూరుకు వచ్చే అవకాశం
- రైల్వే జీఎం నుంచి బోర్డుకు వెళ్లిన ప్రతిపాదనలు

గుంటూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): నిత్యం పగటిపూట ఒక ఇంటర్‌సిటీ రైలుని గుంటూరు-బెంగళూరు- గుంటూరు మధ్యన నడపాలని కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసా ని చంద్రశేఖర్ ప్రతిపాదించారు. ప్రస్తుతం గుంటూరు జిల్లా ప్రజలకు బెంగళూరు వెళ్లేందుకు ఉదయం ఎలాంటి రైలు సదుపాయం అందుబాటులో లేదు. దీనికి సంబంధించిన ప్రతి పాదన దక్షిణమధ్య రైల్వేజోన్ నుంచి కేంద్ర రైల్వేబోర్డుకు వెళ్లిం ది. ఈ ప్రతిపాదనకు బోర్డు ఆమోదం తెలిపితే త్వరలోనే బెంగ ళూరుకు ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు సదుపాయం ఇక్కడి ప్ర యాణీకులకు అందుబాటులోకి వస్తుంది. అమరావతి రాజధా ని నగరాన్ని గుంటూరు జిల్లా కలిగివున్న దృష్ట్యా ఏపీ, కర్ణాటక క్యాపిటల్స్ మధ్యన ఈ రైలు ప్రయాణిస్తుంది. సాఫ్టువేర్ ఇంజనీ ర్లు చాలామంది బెంగళూరు పరిసరాల్లో విధులు నిర్వహిస్తున్నారు. త్వరలోనే అమరావతి రాజధానిలోనూ సాఫ్టువేర్ పరిశ్రమ విస్తరించనుంది. ఈ నేపథ్యంలో గుంటూరు-బెంగళూరు ఇంటర్ సిటీరైలుకు అక్యుపెన్సీ బావుంటుందనే అభిప్రాయం వ్యక్తమౌ తోంది. ప్రస్తుతం విశాఖపట్టణం-ఎల్‌టీటీ(ముంబై) మధ్యన నిత్యం రాకపోకలు సాగిస్తున్న ఎక్స్‌ప్రెస్‌ని గుంటూరు మీదగా మళ్లించా లని కొన్నినెలలుగా రైల్వే వినియోగదారులు కోరుతున్నారు. ఈ రైలు ప్రస్తుతం విజయవాడ నుంచి కాజీపేట మార్గంలో సికింద్రాబాద్‌కు చేరుకొంటుంది. కేవలం కాజీపేట రైల్వేస్టేషన్‌లో మాత్రమే నిలుపుదల సౌకర్యం ఉన్నది. మరోవైపు కాజీపేటకు ఎల్‌టీటీ వెళ్లే రైళ్లు మరికొన్ని ఉన్నాయి. ఈ నేపథ్యంలో గుంటూరు మీదగా ఎల్‌టీటీ రైలుని మళ్లిస్తే గుంటూరు, పల్నాడు, నల్గొండ జిల్లాల ప్రయాణీకులకు ఎంతో మేలు జరుగుతుంది. దీనిని పరిగణనలోకి తీసుకొన్న రైల్వే శాఖ ఈ రైలుని గుంటూరు మీదగా నడిపేందుకు ప్రతిపాదించింది. ఈ విషయాన్ని కూడా కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళితే కొద్ది రోజుల్లోనే ముంబైకి డైలీ రైలు సదుపాయం అందుబాటులోకి వస్తుంది.

ఆర్కిటెక్చర్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజీనామా చేయాలి

- టీఎన్ఎస్ఎఫ్ నాయకుల డిమాండ్


ఆర్కిటెక్చర్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

పెదకాకాని, జూన్ 29: ఏఎన్‌యూలో ఆర్కిటెక్చర్ కాలేజి ప్రిన్సిపల్ ఈదర శ్రీనివాస రెడ్డి ప్రభుత్వం మారినా తన తీరు మార్చుకోకుండా వైసీపీ నాయకుడు వలే ప్రవర్తిస్తున్నారని టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు బత్తుల హేమంత్ ఆరోపించారు. శనివారం వర్సిటీలో ఆయన ప్రిన్సిపాల్‌ని కలిసి ఉద్యోగానికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా హేమంత్ మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో వైసీపీ అనుకూలంగా ఓటు వేయమని విద్యార్థులకు తరగతి గదుల్లో బోధించారని ఆరోపించారు. ఇంజనీరింగ్ కళాశాల పేరు డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలగా మారటానికి ప్రథమపాత్ర పోషించారని అన్నారు. కార్యక్రమంలో టీఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు కొర్రపాటి అభిషేక్, హరీష్, ఎస్డీ గౌస్ యశ్వంత్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీలో అక్రమాలపై సీఐడీ విచారణ జరపాలి

- టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు జి.భాగ్యరాజు

పెదకాకాని, జూన్ 29: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో గత ఐదేళ్లుగా జరిగిన అక్రమాలపై సీఐడీ విచారణ జరిపించాలని వర్సిటీ టీఎన్ఎస్ఎఫ్ నాయకులు జి.భాగ్యరాజు డిమాండ్ చేశారు. శనివారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ని కలిసి వర్సిటీ పరిస్థితిని వివరించారు. ఈ సందర్భంగా భాగ్యరాజు మాట్లాడుతూ వీసీ రాజశేఖర్‌పై చక్రపాణి కమిటీ విచారణ జరుగుతుందన్నారు. అయినా నిబంధనలకి విరుద్ధంగా సజ్జల రామకృష్ణారెడ్డి ఆయనకు వీసీ పదవిని కట్టబెట్టారని తెలిపారు. వీసీ రాజశేఖర్, సజ్జల కలసి యూనివర్సిటీ నిధులలో రూ. కోట్లల్లో అక్రమాలు చేశారన్నారు యూనివర్సిటీ బడ్జెట్ మీద విచారణ జరిపి ప్రొఫెసర్ నాగరాజు, మధుబా బు, ఉదయకుమార్‌లపై కూడా ఏపీ సీఐడీచే విచారణ జరిపించాలని భాగ్యరాజు కోరారు.

కమిషనర్ భార్య.. ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవం

- సామాన్యులకు ఆదర్శం... కమిషనర్‌ను అభినందించిన ప్రజానీకం


ఏరియా వైద్యశాలలో భార్య, బిడ్డతో మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్

బాపట్ల, జూన్ 29: ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో కేవలం పేదప్రజలే వైద్యసేవలు పొందుతారనేది నానుడి. ఎంతోకొంత ఆర్థికస్థోమత ఉన్నవారంతా ప్రైవేటు వైద్యశాలలోనే చికిత్స పొందటానికి ఇష్టపడుతుంటారు. ఇవన్నీ కాదంటూ అందరికి ప్రభుత్వవైద్యశాలలో మంచి వైద్యం అందుతుందని బాపట్ల మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్ తన భార్యకు ఏరియావైద్యశాలలో కాన్పుచేయించి ఆదర్శంగా నిలిచారు. ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధార్థ పర్యవేక్షణలో వైద్యులు డాక్టర్ విజయలక్ష్మి సిబ్బందితో కలిసి కమిషనర్ భార్యకు కాన్పు చేశారు. ప్రభుత్వ వైద్యశాల పట్ల ప్రజలకు నమ్మకం కలిగించేలా కమిషనర్ అనుసరించిన విధానాన్ని అందరు హర్షిస్తున్నారు.

భాష్యం ప్రవీణ్, కొమ్మాలపాటి శ్రీధర్ భేటీ


కొమ్మాలపాటితో ఎమ్మెల్యే ప్రవీణ్

గుంటూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌తో శనివారం భేటీ అయ్యారు. నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలపై వారు చర్చించుకున్నారు. ఎన్నికల్లో పార్టీ విజయం కోసం అవిశ్రాంతంగా పని చేసినవారిని గుర్తుపెట్టుకొని వారికి అవసరమైన సహకారం అందించాలని, సీనియర్లకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలని ప్రవీణ్‌కు శ్రీధర్ సూచించారు. కొందరు రెండు పడవల పై కాళ్లపెట్టిన రీతిలో వ్యవహరించారని అలాంటివారిని పార్టీకి దూరంగా ఉంచాలని సూచించారు. చిన్నవయసులో ప్రతిష్ఠాత్మకమైన విజయం సాధించే అవకాశం దక్కిందని, ప్రజల మన్ననలు పొందేలా ముందుకు సాగాలని ప్రవీణ్‌కు కొమ్మాలపాటి సలహా ఇచ్చారు.

అమరావతికి రండి

- నేపాల్ మాజీ ప్రధానికి జాస్తి ఆహ్వానం


నేపాల్ మాజీ ప్రధాని లోకేంద్ర బహదూర్ చంద్‌కు ఫోటోని బహూకరిస్తున్న డాక్టర్ జాస్తి

గుంటూరు సిటీ, జూన్ 29: బౌద్ధ మత ఆనవాళ్లతో విలసిల్లుతున్న అమరావతికి రావాలంటూ నేపాల్ మాజీ ప్రధానమంత్రి లోకేంద్ర బహదూర్ చంద్‌ను అఖిల భారత పంచాయతీ పరిషత్(న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్య క్షుడు, అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు ఆహ్వానించారు. శనివారం నేపాల్ రాజధాని ఖాట్మండులో బహదూర్‌చంద్‌తో భేటీ అయిన ఆయన నాలుగోసారి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబునాయుడు అమరావతి నిర్మాణం కోసం చేస్తున్న కృషిని వివరించారు. చంద్రబాబునాయుడు సంకల్పం నెరవేరి అమరావతి దేవతలు కొలువుండే రాజధానిగా విలసిల్లుతుందని ఈ సందర్భం గా నేపాల్ మాజీ ప్రధానమంత్రి ఆకాంక్షించారని జాస్తి ప్రకటనలో తెలిపారు. నేపాల్ మాజీ ప్రధాని, ఆయన సతీమణి ఆర్ట్ ఫోటోని బహూకరించారు.

నిరుద్యోగ యువతకు డేటా ఎంట్రీలో శిక్షణ

గుంటూరు(విద్య), జూన్ 29: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత, విద్యార్థులకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. పొన్నూరు నియోజకవర్గంలోని గవర్నమెంట్ డిగ్రి కాలేజీ, చేబ్రోలులోని స్కిల్‌హబ్ నందు డొమెస్టిక్ డేటాఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఇందులో మూడు నెలలపాటు యువతకి నైపుణ్య శిక్షణ కల్పించివారిని స్థానికంగా జిల్లాలోవున్న పరిశ్రమలలో ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఇంటర్ లేదా ఆపైన విద్యార్హతలున్నవారు జులై 3 లోపు స్కిల్‌హబ్‌నందు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9666545975 నందు సంప్రదించాలన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


సూరె ముక్కంటి (ఫైల్‌ఫొటో)

రాజుపాలెం, జూన్ 29: విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని ఉప్పలపాడు గ్రామశివారు చల్లపల్లి తండాలో చోటు చేసుకుంది. సేకరించిన వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని ఇనిమెట్ల గ్రామానికి చెందిన సూరె ముక్కంటి(42) తాపీమేస్త్రిగా జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే చల్లపల్లి తండాలో ఓ ఇంటి నిర్మాణ నిమిత్తం పరంజా కడుతున్నాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు పైనున్న విద్యుత్ వైరు తగిలింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన ముక్కంటిని చికిత్స నిమిత్తం ఆటోలో హాస్పటల్‌కు తీసుకువెళ్లారు. మార్గంమధ్యంలోనే ప్రాణాలుపోయినట్లు చెబుతున్నారు. మృతునికి భార్య, ఇరువురు పిల్లలు ఉన్నారు.

కుడికాలువలో జారిపడి వ్యక్తి మృతి


శ్రీనివాసరావు మృతదేహం

మాచర్ల రూరల్, జూన్ 29: ప్రమాదవశాత్తూ కుడి కాలువలో జారిపడి వ్యక్తి మృతిచెందిన ఘటన శుక్రవారం జరిగింది. బెల్లంకొండ మండలం వన్నాయపాలెంకు చెందిన గడ్డం శ్రీనివాసరావు(40) మాచర్ల మండలం కొప్పునూరులోని తన మామ చీరబోయిన మల్లయ్య ఇంటి వద్ద పదినెలలుగా ఉంటున్నాడు. నాలుగు నెలలుగా అదే గ్రామానికి చెందిన గన్నెబోయిన శ్రీను వద్ద జీవాలను మేపేందుకు జీతానికి కుదిరాడు. శుక్రవారం మధ్యాహ్నం జీవాలను కుడి కాలువ వద్ద కడుగుతూ ప్రమాదవశాత్తూ కాలు జారి కాలువలో కొట్టుకుపోయాడు. మృతుని భార్య గోవిందమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం శ్రీనివాసరావు మృతదేహాన్ని కుడికాలువ నుంచి బయటకు తీశారు. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య


గుర్తు తెలియని మృతదేహం

మాచర్ల రూరల్, జూన్ 29: గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మాచర్ల మండలం విజయపురిసౌత్ కొత్త బ్రిడ్జి వద్ద శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. నాగార్జున సాగర్ బోర్డర్ చెక్‌పోస్టు నుంచి తెలంగాణకు వెళ్లే దారిలోని విజయపురిసౌత్ కొత్త బ్రిడ్జి వద్ద శనివారం పోలీసులు గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గుర్తించారు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో బ్రిడ్జి నుంచి దూకి ఆత్మహత్య చేసుకొని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుని వయసు సుమారు 65 సంవత్సరాలుగా దాకా ఉంటుంది. ఒంటిపై లైట్ గ్రీన్ కలర్ గీతలు గల టీషర్ట్, బ్లూ కలర్ గీతలు గల లుంగీ ధరించి ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.35
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

ఎన్‌పీటీఈఎల్ ఫలితాలలో వీవీఐటీ విద్యార్థుల ప్రతిభ



సర్టిఫికెట్లను చూపుతున్న వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని, జూన్ 29 : భారత ప్రభుత్వం సాంకేతిక విద్య పురోగాభివృద్ధి కొరకు అంతర్జాలం నందు శిక్షణను ఇచ్చి నిర్వహించు ఎన్‌పీటీఈఎల్ (నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ టెక్నాలజీ ఎనాన్స్‌మెంట్ లెర్నింగ్) పరీక్షలో వీవీఐటీ విద్యార్థులు. అధ్యాపకులు ఉత్తమ ప్రతిభ చూపి సర్టిఫికెట్లు పొందినట్లు కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ శనివారం తెలిపారు. అధునాతన పద్ధతులను విద్యార్థులకు, అధ్యాపకులకు పరిచయం చేస్తు దేశ ప్రతిష్టాత్మక సంస్థలైన ఐఐటి, ఐఐఎస్‌సీ వంటి సంస్థలలో నిష్ణాతులైన అధ్యాపకులచే అంతర్జాలం నుంచి శిక్షణను ఇచ్చి తదనంతరం నిర్వహించే ఎన్‌పీటీఈఎల్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరచి 61 మంది కంట్రీటాపర్‌లుగా నిలవగా, 1592 మంది వీవీఐటీ విద్యార్థులు, 16 మంది అధ్యాపకులు సర్టిఫికెట్లు పొందారని వివరించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సిలబస్‌తోపాటు ఆధునిక సాంకేతిక కోర్సులలో విద్యార్థులు శిక్షణ పొందటం వలన సాంకేతికతలో మెరుగైన ఫలితాలు పొందవచ్చని అన్నారు. సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులను, అధ్యాపకులను వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపాల్ వై.మల్లికార్జునరెడ్డి, జాయింట్ సెక్రటరీ మామిళ్లపల్లి శ్రీకృష్ణ, ఎన్‌పీటీఈఎల్ సంధానకర్త కేదార్ మల్లిక్ అభినందించారు.

హ్యాకథాన్ పోటీల్లో ఆర్‌వీఆర్ అండ్‌జేసీ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు(విద్య), జూన్ 29 : ఇటీవల హైదరాబాద్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో ఐఈఈఈ సహకారంతో నిర్వహించిన జాతీయ స్థాయి "48 గంటల హ్యాకథాన్" పోటీల్లో ఐఓటి డొమైన్ విభాగంలో ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ బ్రాంచ్ విద్యార్థులు (4వ సంవత్సరం)లకు జాతీయస్థాయిలో మొదటి బహుమతి వచ్చినట్లు కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ విద్యార్థులు ఐ.ఘన శ్యామ్, ఎస్.ఆదిశయం బోస్, కె.నిఖిత, సీహెచ్ ఇంద్రజ, నలుగురిరితో కూడిన విద్యార్థుల జట్టు రూపొందించిన "రిమోట్ హెల్త్ మానిటరింగ్" అనే పరికర నూతన ఆవిష్కరణ ప్రదర్శనకు జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి అవార్డును, నగదు పురస్కారాన్ని అందుకున్నారు. విద్యార్థులను ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అర్‌అండ్‌డి డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎస్వీ శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న రాయపాటి గోపాలకృష్ణ తదితరులు

ప్రాంగణ ఎంపికల్లో హిందూ ఫార్మసీ విద్యార్థులకు ఉద్యోగాలు

గుంటూరు(విద్య), జూన్ 29: స్థానిక అమరావతి రోడ్డులో గల హిందూ ఫార్మసీ కళాశాలలో శనివారం విక్యుర్ వెల్ నెస్ క్లినిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాల నుంచి 15 మంది ఫార్మ్-డి విద్యార్థులు హాజరుకాగా వారిలో 9 మంది ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపల్, ఫార్మ్.డి డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య, ప్లేస్‌మెంట్ సెల్ కో ఆర్డినేటర్ డాక్టర్ డి.బ్రహ్మ శ్రీనివాసరావు అభినందించారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు తదితరులు

మలబార్ షోరూమ్‌లో 'నువ' డైమండ్స్ కలెక్షన్స్ ప్రారంభం

గుంటూరు, జూన్ 29: యూఏఈలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్ లో అధికారికంగా ప్రారంభించిన తర్వాత గుంటూరు లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులో ఉన్న మలబార్ షోరూమ్‌లో శనివారం 'నువ' డైమండ్స్ కలెక్షన్స్‌ను మలబార్ మేనేజ్‌మెంట్ టీం సభ్యుల సమక్షంలో ముఖ్యఅతిథి రేష్మ ధరియా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్టోర్ హెడ్ నదీర్, మార్కెటింగ్ మేనేజర్ గోపి కిరణ్‌లు మాట్లాడుతూ ప్రకృతి ప్రసాదించిన సంక్లిష్టమైన ఆకృతులు, అలలు, వివిధ రూపాలు మడతలు, అల్లికల నుండి ప్రేరణ పొంది విలాసవంతమైన వజ్రాభరణాలుగా అద్భుతంగా రూపొందించిన వేడుకే ఈ 'నువ' సేకరణ అని అన్నారు. సహజ ప్రపంచంలో కనిపించే గాంభీర్యం నుంచి ప్రేరణ పొందటం ద్వారా సేకరణలోని ప్రతి అంశం ఎంతో సూక్ష్మంగా రూపొందించబడిందన్నారు. జీవితంలోని హెచ్చుతగ్గులను సమపాళ్లలో తీసుకునే పరిపూర్ణ మహిళలా అద్భుతమైన క్లిష్టమైన కళాకృతి ఉద్భవించేలా తయారు చేయబడిందని తెలిపారు. వారు కంటున్న కలలలో వారు ఎప్పుడూ ఉన్నతంగా, స్థిరంగా నిలబడి ఉంటారని స్త్రీలలో మూర్తిభవించిన గాంభీర్యం బలం, దయకు ప్రతి ఆభరణం నిదర్శనంగా నిలబడుతుందని అన్నారు.



నువ డైమండ్స్ కలెక్షన్స్‌ను ప్రారంభిస్తున్న రేష్మ దరియా, నదీర్ తదితరులు

ప్యాకేజీలపై ప్రశ్నలు, గందరగోళం

● అమరావతి సీడ్ యాక్సిస్ రోడ్ రైతుల సమావేశం నేటికి వాయిదా



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటి కలెక్టర్ విశ్వేశ్వరనాయుడు

తాడేపల్లి టౌన్, జూన్ 29: సీడ్ యాక్సిస్ రోడ్డు భూసేకరణ కోసం తాడేపల్లి పరిధిలోని ఉండవల్లి గ్రామ సచివాలయం -2లో సీఆర్‌డీఏ డిప్యూటీ కలెక్టర్ విశ్వేశ్వరనాయుడు శనివారం ఏర్పాటు చేసిన రైతుల సమావేశం గందరగోళానికి దారితీసింది. సమావేశం ప్రారంభం కాగానే ఓ రైతు భూములకు సంబంధించి వివరాలు తెలపాలని కోరారు. అదేవిధంగా ఎంత ప్యాకేజీ ఇస్తారు? ఏ విధంగా ఉంటుంది? అని ప్రశ్నిస్తుండగా అక్కడే ఉన్న టీడీపీకి చెందిన రైతులు కలగ జేసుకుని గత ప్రభుత్వంలో నాలుగేళ్లుగా ఏం చేశారంటూ నిలదీశారు. ఇప్పుడు వచ్చి ప్రశ్నిస్తున్నారని, అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీడ్ యాక్సిస్ భూముల విషయమై కోర్టులో కేసు నడుస్తుండగా మళ్లీ సర్వే ఎలా చేస్తారని కొందరు రైతులు ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో రెండు న్నరేళ్లపాటు కనీసం కౌలు డబ్బులు కూడా ఇవ్వకపోతే ఎందుకు నిలదీయలేదని మరికొందరు రైతులు ప్రశ్నించారు. రాజధాని పేరుతో ధరలు పెరగడంతో భూ ములను రూ.కోట్లకు అమ్ముకుంటున్నారని, అమరావతి కోసం ఏర్పాటు చేస్తున్న సీడ్ యాక్సిస్ రోడ్డుకు అడ్డుపడుతూ అభివృద్ధికి ఆటంకాలు కలిగిస్తున్నారని విమర్శించారు. రైతుల అరుపులు, కేకలతో గందరగోళం ఏర్పడడంతో డిప్యూటీ కలెక్టర్ విశ్వేశ్వరనాయుడు సమావేశం అర్థాంతరంగా నిలిపివేశారు. ఆదివారం సాయంత్రం మరోసారి భేటీ అవుదామని రైతులకు తేల్చి చెప్పారు.

ప్రతి విద్యార్థి చదువే లక్ష్యంగా 'నేను బడికి పోతా'

● పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి



'నేను బడికి పోతా' ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి చదువుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని చేపట్టిందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టాభిపురం మున్సిపల్ హైస్కూల్ నుంచి అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గళ్లా మాధవి హాజరై ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు పట్టాభిపురం మెయిన్ రోడ్డులో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు 'నేను బడికి పోతా' కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. పిల్లలు ఉండాల్సింది పనిలో కాదు.. బడిలో ఉండాలని ఆమె చెప్పారు. 6 నుంచి 14 సంవత్సరాలలోపు ప్రతి విద్యార్థి పాఠశాలల్లో చదువుకోవటమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, డిప్యూటీ ఈవో వెంకటేశ్వరావు, ఎంఈఓ జ్యోతి రాణి, వీరబాబు, జెట్టిబాబు, నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌కు మంచి రోజులు

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి మంచి రోజులు రాబోతున్నాయని గళ్లా మాధవి అన్నారు. కేంద్ర మంత్రి పెమ్మసాని ఆధ్వర్యంలో జరిగిన సమావేశం అనంతరం ఆమె ఆసుపత్రి వార్డుల్లో పర్యటించారు. వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రిలో ఉన్న సమస్యలను పరిష్కరించి, వైద్య సేవలు పెంచేందుకు చర్యలు చేపడుతున్నామని ఆమె బాధితులతో చెప్పారు.



వీసీకి వినతిపత్రం అందజేస్తున్న ఆలా వెంకటేశ్వర్లు

ఆంధ్ర విద్యార్థులకే ఎంబీబీఎస్ సీట్లు కేటాయించాలి

● హెల్త్ వర్శిటీ వీసీ బాబ్జీకి డాక్టర్ ఆలా విజ్ఞప్తి

గుంటూరు (మెడికల్) జూన్ 29: సిద్ధార్థ వైద్య కళాశాలలో అన్ని మెడికల్ సీట్లను ఈ విద్యా సంవత్సరం నుంచి పూర్తిగా ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు మాత్రమే కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ కోరుకొండ బాబ్జీని కోరారు. ఈ మేరకు శుక్రవారం డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు అధ్యక్షతన అసోసియేషన్ సభ్యులు వీసీని కలసి వినతిపత్రం అందజేశారు. సిద్దార్థ వైద్య కళాశాల ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు తెలంగాణ విద్యార్థులకు 36 శాతం సీట్లను కేటాయిస్తున్నట్లు డాక్టర్ ఆలా తెలిపారు. తెలంగాణ రాష్ట్రం విడిపోయి పదేళ్ల పూర్తయిన సందర్భంగా ఇప్పటికీ తెలంగాణ విద్యార్థులకు ఇక్కడ మెడికల్ సీట్లను కేటాయిస్తే ఆంధ్ర విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వివరించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి కళాశాలలో అన్ని ఎంబీబీఎస్ సీట్లను పూర్తిగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విద్యార్థులకే కేటాయించాలని కోరారు. హెల్త్ వర్శిటీ వీసీని కలసిన బృందంలో ఏపీ మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ కోశాధికారి కే నరసింహరావు, లీగల్ అడ్వైజర్ వైరాగూర్ తదితరులు ఉన్నారు.

మత్స్య సహకార సంఘాలకు శిక్షణ

గుంటూరు సిటీ, జూన్ 29 : జిల్లాలోని ఏడు మత్స్య సహకార సంఘాలకు శిక్షణా కార్యక్రమం శనివారం నిర్వహించారు. జిల్లా మత్స్య శాఖ అధికారి పి.గాలిదేముడు ఈ కార్యక్రమంలో పాల్గొన్న చేపల రైతులకు శిక్షణనిచ్చారు. ఆయన మాట్లాడుతూ మత్స్య సహకార సంఘాలను చేపల రైతుల ఉత్పత్తిదారుల సమాఖ్య కేంద్ర ప్రభుత్వం మార్పు చేసినట్లు తెలిపారు. చేపల రైతుల ఉత్పత్తిదారుల సమాఖ్య ద్వారా మత్స్యకారుల్లో వ్యాపార దక్షతను పెంపొందించటం కేంద్ర ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. అందుకు అనుగుణంగా జాతీయ సహకార అభివృద్ధి సంస్థ ద్వారా మేనేజ్‌మెంట్ కాస్ట్, ఈక్విటీ గ్రాంట్‌లు పొందేందుకు సమర్పించవలసిన తీర్మానం, షేర్లపై అవగాహన కలిగి ఉండాలని గాలిదేవుడు సూచించారు. ఈ కార్యక్రమంలో మత్స్య అభివృద్ధి అధికారి ఎండీ జైనుల్లాఖాన్, ప్రిన్సిపాల్ ముత్యాల రామ్మోహన్‌రావు, కో ఆర్డినేటర్ వేదాంతం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

● ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులకు మాలమహానాడు విజ్ఞప్తి

గుంటూరు, జూన్ 29: రాష్ట్రంలో దళితుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్‌కుమార్ శనివారం నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలను కోరారు. పార్లమెంటరీ టీడీపీ నేతగా ఇటీవల ఎంపికైన నేపథ్యంలో గుంటూరులోని కార్యాలయంలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయులను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో దళితులకు సంబంధించిన అనేక సంక్షేమ పథకాలను రద్దు చేశారని, అవన్నీ పునరుద్దరించటంతో పాటు అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కూచిపూడి జాన్‌బాబు, జడ కమలాకర్, తలమాల రత్నబాబు, మస్తాన్‌వలి, అశోక్ తదితరులున్నారు.

మైనార్టీ బాలికల విద్యాభివృద్ధికి కృషి చేయడం హర్షణీయం

గుంటూరు(విద్య), జూన్ 29: ముస్లిం, మైనార్టీ విద్యార్థినుల విద్యాభివృద్ధికి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం విజయలక్ష్మీ చేసిన కృషి అభినందనీయమని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. చౌత్రాసెంటర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్ఎం విజయలక్ష్మి పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్లిం, మైనార్టీల విద్యార్థినులు చదువుతోపాటు, క్రీడా, సాంస్కృతిక విభాగాల్లో రాణించేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. పాఠశాలలో అనేక మంది విద్యార్థినులు పదిలో అత్యుత్తమ ఫలితాలు సాధించి ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రోత్సహించారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పూర్వ డీఈవో చంద్రమోహన్, ఉర్దూ డిఐ ఖాసిం, విశ్రాంత ఉపాధ్యాయులు హెచ్ఎం విజయలక్ష్మీ భర్త రాజాసుందరబాబు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి డిఎస్ మృతికి లింగంశెట్టి సంతాపం

గుంటూరు, జూన్ 29 : మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ మృతికి కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు ఒక ప్రకటనలో సంతాపం తెలియజేశారు. డీఎస్ మృతి సమాచారం తనకు దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. ఉమ్మడి రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడుగా, మంత్రిగా ఎనలేని సేవలందించారన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలోనూ డిఎస్ కీలక పాత్ర పోషించారన్నారు. డీఎస్‌తో తనకు తొలి నుంచి మంచి సన్నిహిత సంబంధాలున్నాయని గుర్తు చేశారు. డీఎస్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

సచివాలయ వెల్ఫేర్ సెక్రెటరీ ఆత్మహత్య

గుంటూరు జూన్ 29 స్థానిక లాలాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఐపిడి కాలనీలో గల 53వ సచివాలయం వెల్ఫేర్ సెక్రెటరీ జోయల్ శ్యాంసన్(43) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టాభిపురం స్టేషన్ పరిధిలోని కృష్ణనగర్‌కు చెందిన శ్యాంసన్‌కు గతంలో వివాహం జరిగింది. భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు రావడంతో విడాకులు తీసుకున్నారు. శ్యాంసన్ తన స్నేహితులతో కలసి కృష్ణనగర్‌లో గది అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. శ్యామ్సన్ 53వ సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇదిలా ఉంటే ఈ నెల 2 నుంచి శ్యామ్సన్ విధులకు రావడం లేదు. శనివారం 52వ సచివాలయంపై అంతస్తులోని స్టోర్‌రూమ్ నుంచి దుర్వాసన వస్తుడంతో సిబ్బంది లాలాపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి తలుపు తీసి చూడగా అందులో శ్యామ్సన్ మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉంది. ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. 26నే ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం మార్చురీకి తరలించారు. ఆత్మహత్యకు అప్పులతో పాటు కుటుంబ కలహాలే కారణమై ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

నేడు వ్యవసాయంపై కేంద్ర మంత్రి పెమ్మసాని సమీక్ష

గుంటూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయ రంగంపై కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆదివారం సమీక్ష నిర్వహించనున్నారు. కలెక్టరేట్‌లో జరగనున్న ఈ సమీక్షకు సంబంధిత అధికారులంతా హాజరుకావాలని ఆదేశించారు. వ్యవసాయానికి సంబంధించి సమగ్ర సమాచారంతో హాజరు కావాలని సూచించారు.

సలాం సేవలు ఎనలేనివి : చైర్‌పర్సన్

గుంటూరు సిటీ, జూన్ 29 : 41 సంవత్సరాల పాటు జిల్లా పరిషత్ డ్రైవర్ గా పని చేసిన ఎస్‌కే సలాం సేవలు ఎనలేనివని జడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెని క్రిస్టినా అన్నారు. శనివారం జిల్లా పరిషత్ కార్యాలయం ఏసీ హాల్ నందు జరిగిన డ్రైవర్ సలాం పదవీ విరమణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇప్పటికీ ఉద్యోగం పట్ల ఆయనకు వున్న ఆసక్తి, ప్రేమ, అంకిత భావం చాలా గొప్పవని అన్నారు. విశిష్ఠ అతిథిగా హాజరైన జడ్పీ మాజీ చైర్ పర్సన్ కూచిపూడి విజయ మాట్లాడుతూ సలాం మంచి నమ్మకస్తుడని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కత్తెర సురేష్ కుమార్, జిల్లా పరిషత్ డిప్యూటి సీఈఓ మోహన్‌రావు ఉద్యోగులు పాల్గొన్నారు. మే నెలలో పదవీ విరమణ చేసిన సీనియర్ అసిస్టెంట్ కె.డేవిడ్ పాల్‌ని కూడా చైర్‌పర్సన్ క్రిస్టినా దంపతులు సన్మానించారు.

మైనార్టీల ఆర్థిక, సాంఘిక రక్షణ కమిటీని విస్మరించిన వైసీపీ

గుంటూరు, జూన్ 29 : మైనార్టీల ఆర్థిక, సాంఘిక రక్షణ కమిటీని వైసీపీ ప్రభుత్వం విస్మరించిందని మైనార్టీ ఆశయ సాధన సమితి నాయకులు ఎస్ఎం షరీఫ్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ శనివారం మైనార్టీ ఆశయ సాధన సమితి స్థానిక కార్యాలయంలో సంఘం బలోపేతం, మైనార్టీలకు సంబంధించిన పలు అంశాలపై జరిగిన చర్చల్లో షరీఫ్ మాట్లాడుతూ వైసీపీ మైనార్టీల్లో విశ్వాసం కోల్పోయిందని గుంటూరు తూర్పుతో సహా 20కి పైగా మైనార్టీ ప్రజల ప్రాంతాల్లో కనుమరుగైందన్నారు. గుంటూరు తూర్పు శాసనసభ్యులు నసీర్ అహ్మద్ ఆధ్వర్యంలో ఈ కమిటీ ఏర్పాటుకు సాధ్యసాధ్యాలను చూడాలని ప్రభుత్వాన్ని షరీఫ్ కోరారు. దీనిపై త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబుకి, మైనార్టీ మంత్రి ఫారూక్‌ని కలవనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు జానీ భాష, ఆరిఫ్, సంధాని, ఆసిఫ్, రెహమాన్ పాల్గొన్నారు.



కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను మాస్టర్ మైండ్ అడ్మిన్ డైరెక్టర్ మట్టుపల్లి మోహన్ శనివారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మట్టుపల్లి మోహన్‌కు కేంద్ర మంత్రి పెమ్మసాని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను సత్కరించి మిఠాయి తినిపించారు. నిష్ణాతులైన సీఏ నిపుణుల్ని తయారు చేసి దేశ ఆర్థికాభివృద్ధికి చేయూత ఇవ్వాలని మంత్రి సూచించారు.

రైల్వేట్రాక్ సమస్య పరిష్కరిస్తే రైతులకు మేలు

● కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని

తెనాలి రూరల్, జూన్ 29: బుర్రిపాలెం-యడవర్రు రోడ్డులోని తెనాలి -అనంతవరం-జంపని వద్ద లెవల్ క్రాసింగ్ రైల్వే గేటును మూసివేయడం వల్ల ఇక్కట్లు పాలవుతున్నామని స్థానిక రైతులు, ప్రజలు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు విన్నవించారు. కేంద్రసహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా స్వగ్రామం బుర్రిపాలెం వస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్‌ను పలువురు రైతులు కలిసి లెవల్ క్రాసింగ్ రైల్వే గేటు మూయడం వల్ల కలుగుతున్న ఇబ్బందులపై పెమ్మసాని చంద్రశేఖర్‌కు వివరించారు. స్పందించిన పెమ్మసాని రైతులతో కలిసి నేరుగా సమస్యఉన్న ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. ఈ దారిని మూసివేయడం ద్వారా చుట్టూ తిరిగి పెదరావూరు మీదుగా దాదాపుగా 14కిలీమీటర్ల మేర ప్రయాణించాల్సి వస్తుందని రైతులు పెమ్మసాని ఎదుట వాపోయారు. పెమ్మసాని చంద్రశేఖర్ స్పందిస్తూ సంబంధిత రైల్వే అధికారులతో ఫోన్లో మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఆ గేటును తొలగించడం లేదా ప్రయాణాలకు అనువుగా ప్రత్యామ్నాయ మార్గాలకు అవకాశం కల్పించాలని అధికారులకు సూచించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు వివరించారు.



సమస్య ప్రాంతాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న పెమ్మసాని

కాల్ మనీ వేధింపులపై అరండల్‌పేట స్టేషన్లో ఫిర్యాదు

అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగండ్ల రాంబాబు అనే వ్యక్తిని అధిక వడ్డీ డబ్బుల కోసం వేధిస్తుండగా పోలీసులు కాల్‌మనీ కేసు నమోదు చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో కన్నెబోయిన బాబురావు, కన్నబోయిన వెంకటేష్ అనే ఇరువురు రాంబాబుకు పది లక్షలు అప్పుగా ఇచ్చారు. దీనికి సంబంధించి రూ.50 లక్షలు తిరిగి ఇవ్వాలంటూ వేధిస్తుండడంతో రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో చైన్ స్నాచింగ్

గుంటూరు జూన్ 29 : స్థానిక అరండల్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని చైతన్యపురిలో ఓ మహిళ మెడలో దుండగులు చైన్ స్నాచింగ్ కు పాల్పడ్డారు. చైతన్యపురి మూడో లైన్ కి చెందిన నెల్లూరి మంజూష శుక్రవారం రాత్రి ట్యూషన్లో ఉన్న తన పిల్లలను తీసుకొచ్చేందుకు వెళుతుండగా ఇంటి సమీపంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన దుండగులు ఆమె మెడలోని 12 గ్రాముల బంగారపు గొలుసు తెంపుకొని పరారయ్యారు బాధితురాలు ఫిర్యాదు మేరకు శనివారం అరండల్ పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

రేపు రాష్ట్రంలో పింఛన్ల పండగ

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి) : జూలై 1న రాష్ట్రంలో పింఛన్ల పండుగ జరుగుతోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. నియోజకవర్గంలోని తన కార్యాలయంలో శనివారం టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్చార్జులు, బూత్ కన్వీనర్లు, అనుబంధ విభాగాల నేతలు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జులై 1న ఇంటింటికి వెళ్లి సచివాలయం సిబ్బందితో రూ.7 వేలు పింఛను ఇవ్వనున్నట్లు తెలిపారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పండుగలా జరపాలనీ మూడు పార్టీల నేతలకు ఆయన పిలుపునిచ్చారు. 83 సచివాలయాలు ఉన్నాయని, సుమారు 25,690 మందికి పింఛన్లు అందించనున్నామని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన విధంగా పింఛను రూ.4 వేలకు పెంచడంతోపాటు బకాయిలు మొత్తం కలిపి జూలై 1న రూ. 7వేలు ఇస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర, జాగర్లమూడి శ్రీనివాస్, ముప్పవరపు భారతి, చిన్నీ, మీరావలి, ప్రభాకర్, జనసేన వీర మహిళ అధ్యక్షురాలు పాకనాటి రమాదేవి, మాలిక, వేముల శీను, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా తెలుగు యువత పనిచేయాలి



సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సాయికృష్ణ

గుంటూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య తెలుగు యువత వారధిలా పని చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. గుంటూరు జిల్లా తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు రావిపాటి సాయికృష్ణ శనివారం పార్టీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చంద్రబాబు తెలుగు యువతకు కర్తవ్య నిర్దేశం చేశారు.

మిర్చి రైతులకు కోట్లలో కుచ్చు టోపీ పెట్టిన వ్యాపారి

● జిల్లా ఎస్పీకి బాధిత రైతుల ఫిర్యాదు

గుంటూరు, జూన్ 29 : ఆరుగాలం కష్టించి పంట పండించిన రైతులకు ఓ వ్యాపారి కుచ్చు టోపీ పెట్టడం కలకలం రేపింది. పెదకూరపాడు నియోజకవర్గానికి చెందిన బాధిత రైతులు శనివారం తెలుగు మహిళా నాయకురాలు వేగుంట రాణి ఆధ్వర్యంలో ఎస్పీని ఆశ్రయించారు. బాధిత రైతుల ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అచ్చంపేట మండలం గందసిరి, ఓర్వకల్లు తదితర గ్రామాల్లో ఏటుకూరుకు చెందిన మిర్చి వ్యాపారి లక్కిశెట్టి రవికుమార్ రైతుల నుంచి మిర్చి కొనుగోలు చేసారు. వారం పది రోజుల్లో డబ్బులు ఇస్తానని రైతులను నమ్మించి మిర్చి కొనుగోలు చేసిన రవికుమార్ వారికి డబ్బులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నాడని రైతులు వాపోయారు. గట్టిగా అడిగిన రైతులపై రవికుమార్ బెదిరింపులకు దిగుతున్నాడన్నారు. ఇటీవలే డబ్బులు కోసం వచ్చిన తమపై వ్యాపారి దాడి చేయించా డన్నారు. తమకు సుమారు ఐదు కోట్ల వరకు ఇవ్వాల్సి ఉందని బాధిత రైతులు వాపోయారు. తమకు న్యాయం చేయాలని వారు జిల్లా ఎస్పీని బాధిత రైతులు వేడుకున్నారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించేలా ప్రత్యేక కౌంటర్లు

గుంటూరు, జూన్ 29 : నెలాఖరు నేపథ్యంలో విద్యుత్‌బిల్లులు చెల్లించేలా ఆదివారం కూడా కౌంటర్లు పని చేస్తాయమని గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ ఆవుల మురళీకృష్ణయాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. సర్కిల్ పరిధిలోని అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలు అందుబాటులో ఉంటాయన్నారు. అలానే ఇంటి నుంచే నేరుగా విద్యుత్ బిల్లులు చెల్లించేలా మొబైల్‌లో ఏపీసీపీడీసీఎల్ కస్టమర్ యాప్, ఫోన్‌పే, గూగుల్‌పేల నుంచి కూడా బిల్లులు చెల్లించవచ్చన్నారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

గుంటూరు, జూన్ 29 : స్థానిక విజయవాడ-కృష్ణ కెనాల్ మధ్య రైలు పట్టాల పక్కన గుర్తు తెలియని యువకుడు గాయాలతో మృతి చెంది ఉన్నాడు. మృతుడి జేబులో విజయవాడ నుంచి ఒంగోలు వెళ్లేందుకు రైల్వే టికెట్టు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. సుమారు 30 సంవత్సరాల వయసు ఉంటుందని పోలీసులు తెలిపారు.

దిక్సూచి DIKSUCHI

అగ్రి డిప్లొమాలు

ఎన్‌జీ రంగా వర్సిటీ

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ- డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. అగ్రికల్చర్, సీడ్ టెక్నాలజీ, ఆర్గానిక్ అగ్రికల్చర్ విభాగాల్లో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ వ్యవధి మూడేళ్లు. పదోతరగతి/తత్సమాన పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రభుత్వ పాలిటెక్నిక్‌లతోపాటు అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిప్లొమాలు-సీట్లు

- డిప్లొమా ఇన్ అగ్రికల్చర్-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 578 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 1900 సీట్లు ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ సీడ్ టెక్నాలజీ-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 25 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 260 సీట్లు ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ ఆర్గానిక్ అగ్రికల్చర్-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 25 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 40 సీట్లు ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 60 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 330 సీట్లు ఉన్నాయి.
- కనీసం నాలుగేళ్లు గ్రామీణ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు 75 శాతం సీట్లు, పట్టణ ప్రాంతాల్లో చదివినవారి కోసం 25 శాతం సీట్లు ప్రత్యేకించారు. మొత్తం సీట్లలో 85 శాతం సీట్లను స్థానికులకు నిర్దేశించారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

అర్హత వివరాలు: ఆంధ్రప్రదేశ్/తెలంగాణ స్టేట్ బోర్డు లేదా సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ/ఎన్ఐఓఎస్/ఏపీఓఎస్ఎస్/టీఓఎస్ఎస్ నుంచి పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. పదోతరగతి కంపార్ట్‌మెంటల్ అభ్యర్థులు; ఇంటర్ ఫెయిల్/మధ్యలో ఆపేసినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ ఉత్తీర్ణులు/ఆపై చదివినవారు దరఖాస్తుకు అనర్హులు. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 30
- **వెబ్‌సైట్:** angrau.ac.in



డా.వైఎస్సార్ హెచ్‌యూ

పశ్చిమగోదావరి జిల్లా-వెంకటరామన్నగూడెంలోని డా.వైఎస్సార్ హార్టికల్చరల్ యూనివర్సిటీ(డా.వైఎస్సార్‌హెచ్‌యూ)- డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. రాష్ట్రంలోని ప్రభుత్వ, అనుబంధ హార్టికల్చరల్ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ నిర్వహించనున్నారు. డిప్లొమా ఇన్ హార్టికల్చర్ ప్రోగ్రామ్‌లో 528 సీట్లు, డిప్లొమా ఇన్ హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ ప్రోగ్రామ్‌లో 22 సీట్లు చొప్పున మొత్తం 550 సీట్లు ఉన్నాయి. వీటిలో 75 శాతం సీట్లను గ్రామీణ విద్యార్థులకు, 25 శాతం సీట్లను పట్టణ ప్రాంతాల వారికి కేటాయించారు. మొత్తం సీట్లలో 85 శాతం సీట్లను స్థానికులకు ప్రత్యేకించారు. మిగిలిన 15 శాతం సీట్లకు దేశవ్యాప్తంగా అభ్యర్థులందరూ పోటీపడవచ్చు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు వర్తిస్తాయి. పదోతరగతి/తత్సమాన పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది.

డిప్లొమా ఇన్ హార్టికల్చర్ సీట్ల వివరాలు

ప్రభుత్వ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లు: డా.బీ.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా-రామచంద్రాపురంలోని ఎస్‌కేపీపీ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 60 సీట్లు, ఏలూరు జిల్లా-నూజివీడులోని హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 40 సీట్లు, అన్నమయ్య జిల్లా-కలికిరిలోని హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 40 సీట్లు, శ్రీ సత్యసాయి జిల్లా-మడకశిరలోని ఎస్ఎస్‌పీజీ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 60 సీట్లు చొప్పున మొత్తం 200 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అదనంగా పది శాతం సీట్లు కేటాయించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో మొత్తం 220 సీట్లు ఉన్నాయి.

అనుబంధ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లు: శ్రీకాకుళం జిల్లా-ఎస్వీ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, మన్యం జిల్లా-ఎస్ఆర్ఆర్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, ఏలూరు జిల్లా-నోవా కాలేజ్ ఆఫ్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, పలనాడు జిల్లా-సాదినేని చౌదరయ్య హార్టికల్చరల్ పాలిటెక్నిక్, ప్రకాశం జిల్లా-శ్రీ బెల్లంకొండ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, వైఎస్సార్ కడప జిల్లా-ఎస్‌బీవీఆర్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, నంద్యాల జిల్లా-ఎస్ఆర్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లలో ఒక్కోదానిలో 40 చొప్పున మొత్తం 280 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అదనంగా 28 సీట్లు కేటాయించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో మొత్తం 308 సీట్లు ఉన్నాయి.

డిప్లొమా ఇన్ హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ సీట్ల వివరాలు: నంద్యాల జిల్లాలోని హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ పాలిటెక్నిక్ కళాశాలలో 20 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అదనంగా 2 సీట్లు కేటాయించారు. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 22 సీట్లు ఉన్నాయి.

అర్హత: బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ నిర్వహించే పదోతరగతి పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. సీబీఎస్ఈ/ఎన్ఐఓఎస్/ఓఎస్ఎస్/ఐసీఎస్ఈ అభ్యర్థులు కూడా అర్హులే. పదోతరగతి కంపార్ట్‌మెంటల్ అభ్యర్థులు, ఇంటర్ మధ్యలో ఆపేసిన/ఫెయిల్ అయిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ ఉత్తీర్ణులు, ఆపై చదివినవారు దరఖాస్తుకు అనర్హులు. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- **దరఖాస్తు, కౌన్సెలింగ్ ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 6
- **వెబ్‌సైట్:** https://drysrhu.ap.gov.in

ఎఫ్‌సీఆర్ఐలో బీఎస్సీ ఆనర్స్ ఫారెస్ట్రీ

సిద్దిపేట జిల్లా ములుగులోని ఫారెస్ట్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌సీఆర్ఐ) హైదరాబాద్- బీఎస్సీ(ఆనర్స్) ఫారెస్ట్రీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. మొత్తం 55 రెగ్యులర్ సీట్లు ఉన్నాయి. టీజీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. మేథమెటిక్స్ స్ట్రీమ్ అభ్యర్థులకు 25 శాతం, బయాలజీ స్ట్రీమ్ అభ్యర్థులకు 75 శాతం సీట్లు ప్రత్యేకించారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ లేదా మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ లేదా మేథమెటిక్స్, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్ అభ్యర్థులకు 45 శాతం; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు ఉండాలి. టీజీ ఈఏపీసెట్ 2024 అర్హత పొంది ఉండాలి. అభ్యర్థుల వయసు డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మూడేళ్లు; దివ్యాంగులకు అయిదేళ్ల సడలింపు వర్తిస్తుంది.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 1
- **వెబ్‌సైట్:** www.fcrihyd.in/

ఇఫ్లూలో ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ కోర్సు

హైదరాబాద్‌లోని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ(ఇఫ్లూ-సెంట్రల్ యూనివర్సిటీ)- ఇంగ్లీష్‌లో 160 గంటల ప్రొఫిషియెన్సీ కోర్సును నిర్వహిస్తోంది. అభ్యర్థులు ఆంగ్ల భాషలో ప్రావీణ్యం సాధించేందుకు ఈ ప్రోగ్రామ్ ఉపకరిస్తుంది. హైదరాబాద్ క్యాంపస్‌లో మొత్తం 200 సీట్లు ఉన్నాయి. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ ఆగస్టులో ప్రారంభమౌతుంది.



కోర్సు వివరాలు

- ఇందులో బేసిక్, ఇంటర్మీడియట్, అడ్వాన్స్‌డ్ లెవెల్స్ ఉంటాయి. ప్లేస్‌మెంట్ టెస్ట్ ద్వారా లెవెల్ అడ్మిషన్ ఉంటుంది. కోర్సు వ్యవధి నాలుగు నెలలు. రోజుకు రెండు గంటలు చొప్పున వారానికి అయిదు రోజులు తరగతులు నిర్వహిస్తారు. తరగతికి 30 నుంచి 35 మంది అభ్యర్థులు ఉంటారు. ఉదయం, సాయంత్రం బ్యాచ్‌లు నిర్వహిస్తారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉం టుంది. కనీసం 80 శాతం అటెండెన్స్ తప్పనిసరి.
- కోర్సులో భాగంగా ఇంగ్లీష్ లాంగ్వేజ్‌కు సంబంధించి లిజెనింగ్, స్పీకింగ్, రీడింగ్, రైటింగ్, కమ్యూనికేషన్, గ్రామర్, ఒకాబులరీ అంశాల్లో శిక్షణ ఇస్తారు. వారానికి ఒకసారి ప్రొనౌన్సియేషన్ ప్రాక్టీస్ ఉంటుంది. రీసెర్చ్ స్కాలర్స్, టీచింగ్ అసిస్టెంట్లు క్లాస్‌రూం తరగతులు నిర్వహిస్తారు. వీటికి సంబంధించిన మెటీరియల్ ఫొటోకాపీ ఇస్తారు. డిజిటల్ ల్యాబ్స్ ఉంటాయి. అభ్యర్థుల నెలవారీ ప్రోగ్రెస్‌ను పరీక్షిస్తారు. కోర్సు చివరలో ఫైనల్ టెస్ట్ ఉంటుంది. ఇందులో ఉత్తీర్ణులైనవారికి మాత్రమే సర్టిఫికెట్‌లు ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైనవారు; సంస్థ నిర్వహించే 40 గంటల ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ కోర్సు పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. విదేశీ విద్యార్థులు వీసా, రెసిడెన్స్ పర్మిట్ కాపీలు సబ్మిట్ చేయాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం:** జూలై 1
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 28
- **వెబ్‌సైట్:** www.efluniversity.ac.in

ఉస్మానియా యూనివర్సిటీలో వర్క్‌షాప్

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్(డీఈఈ)- వారం రోజుల వర్క్‌షాప్‌ను నిర్వహిస్తోంది. దీని ప్రధానాంశం 'అప్లికేషన్స్ ఆఫ్ డిజిటల్ కంట్రోల్ ఇన్ పవర్ ఎలక్ట్రానిక్ కన్వర్టర్స్'. ఈ వర్క్‌షాప్‌ను ఆర్‌యూఎస్ఏ-2.0, వీఐ మైక్రో సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు స్పాన్సర్ చేస్తున్నాయి. ఇందులో ఫండమెంటల్ అండ్ అడ్వాన్స్‌డ్ థియరిటికల్ కాన్సెప్ట్‌లు; మైక్రోకంట్రోలర్స్, డిజిటల్ సిగ్నల్ ప్రాసెసర్స్, ఫీల్డ్ ప్రోగ్రామబుల్ గేట్ యారేస్‌ల వినియోగం; ల్యాబొరేటరీ సెషన్స్ ఉంటాయి. సంబంధిత విభాగాలకు చెందిన రీసెర్చ్ స్కాలర్స్, ఇండస్ట్రీ పార్టిసిపెంట్స్, ఫ్యాకల్టీ మెంబర్లు, విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైనవారికి ఈ-మెయిల్ ద్వారా సమాచారమిస్తారు.

- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రీసెర్చ్ స్కాలర్స్‌కు రూ.2,500; ఫ్యాకల్టీ మెంబర్లు, విద్యార్థులకు రూ.3,500; ఇండస్ట్రీ పార్టిసిపెంట్స్‌కు రూ.4,500
- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** జూన్ 30
- **వర్క్‌షాప్ వ్యవధి:** జూలై 8 నుంచి 13
- **వెబ్‌సైట్:** www.uceou.edu

హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్‌లో ఖాళీలు

జాబ్ కార్నర్

సికింద్రాబాద్‌లోని హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్ లిమిటెడ్...కాంట్రాక్ట్ ప్రాతిపదికన బీబీనగర్ ఎయిమ్స్(అమృత్ ఫార్మసీ ఔట్‌లెట్‌లు), తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ ఆస్పత్రుల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తుంది.

ఫార్మసిస్ట్: బి.ఫార్మసీ/డి.ఫార్మసీ ఉత్తీర్ణతతో పాటు రెండేళ్ల పని అనుభవం ఉండాలి

అసిస్టెంట్ ఫార్మసిస్ట్: బి.ఫార్మసీ/డి.ఫార్మసీ ఉత్తీర్ణులై ఉండాలి.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా **ఇంటర్వ్యూ తేదీలు:** జూలై 4

వెబ్‌సైట్: www.lifecarehll.com/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/soMebZfలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

ఫహాద్‌పై సుమోటో కేసు

మలయాళ నటుడు, నిర్మాత ఫహాద్ ఫాజిల్‌పై కేరళ మానవ హక్కుల సంఘం సుమోటో కేసు నమోదు చేసింది. దీనిక్కారణం ఆయన నిర్మిస్తున్న 'పింకేలీ' సినిమా షూటింగ్. అంగమలైలోని ఎర్నాకులం ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం రాత్రంతా ఈ సినిమా కోసం షూటింగు చేయడంతో



అక్కడున్న రోగులంతా ఇబ్బంది పడ్డారు. ఆస్పత్రి లోపలికి ఎవరినీ అనుమతించకుండా అత్యవసర విభాగం అనుమతి తీసుకోకుండా షూటింగ్ చేశారనేది ఆరోపణ. దీనిపై ఎర్నాకులం జిల్లా వైద్యాధికారి బీనా కుమారి సీరియస్ అయ్యారు. ఏడు రోజుల్లో ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఈ వ్యవహారాన్ని సుమోటోగా తీసుకున్న కేరళ మానవ హక్కుల సంఘం నిర్మాత ఫహాద్‌పై కేసు నమోదు చేసింది.

'హరిహర వీరమల్లు' వచ్చేది ఎప్పుడంటే


పవన్‌కల్యాణ్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'హరిహరవీరమల్లు' మీదే ఇప్పుడందరి దృష్టి ఉంది. అగ్ర నిర్మాత ఏ.ఎం.రత్నం నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం చాలా కాలంగా నిర్మాణంలో ఉంది. ఈ సినిమా విడుదల ఎప్పుడా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. హీరో పవన్‌కల్యాణ్ రాజకీయాలతో బిజీ కావడం వల్ల నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ శాసన సభకు జరిగిన ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ గెలిచి, ఉపముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించి, బిజీగా ఉండడంతో ఆయన ఆర్టిస్టుగా తిరిగి సెట్‌లోకి అడుగు పెట్టడానికి మరింత ఆలస్యం అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఇటువంటి నేపథ్యంలో 'హరిహర వీరమల్లు' చిత్రం గురించి అప్‌డేట్ ఇచ్చారు నిర్మాత ఎ.ఎం.రత్నం. 'సినిమాలో పవన్‌కల్యాణ్ వర్క్ దాదాపు పూర్తయింది. మరో 20-25 రోజులు ఆయన కేటాయిస్తే షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. ప్రస్తుతం పవన్‌కు ఉన్న బిజీ షెడ్యూల్ ను దృష్టిలో పెట్టుకుని షూటింగ్ ప్లాన్ చేస్తాం. మా సినిమా స్ట్రీమింగ్ రైట్స్ అమెజాన్‌కు ఇచ్చాం. వారితో చేసుకున్న ఒప్పందం ప్రకారం అక్టోబరులో సినిమాను విడుదల చేయాలి. అయితే ఇంకాస్త సమయం కావాలని వాళ్లను అడుగుతాం. డిసెంబర్ నాటికి విడుదల చేయడానికి ప్రయత్నిస్తాం. ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని కలిగిస్తుంది' అని చెప్పారు. సినిమా ఆలస్యం అవుతున్న కారణంగా 'హరిహర వీరమల్లు' చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న క్రిష్ తప్పుకోవడంతో జ్యోతికృష్ణ దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు.





ప్రముఖ నటి వరలక్ష్మీ శరత్‌కుమార్ త్వరలోనే ప్రియుడు నికోలయ్ సచ్‌దేవ్‌తో ఏడడుగులు వేయనున్నారు. ప్రస్తుతం ఆమె పెళ్లి పనుల్లో బిజీగా ఉన్నారు. సినీ, రాజకీయ ప్రముఖులను కలిసి ఆహ్వాన పత్రికలు పంచుతున్నారు. శనివారం వరలక్ష్మి కుటుంబ సమేతంగా ప్రధాని మోదీని కలిశారు. తమ వివాహ కార్యక్రమానికి హాజరయ్యి ఆశీస్సులు అందించాలని కోరారు. ఈ సందర్భంగా దిగిన ఫొటోలను ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసి, ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు.

గతంతో ముడిపడిన కథ



విజయ్‌ఆంటోని నటిస్తున్న చిత్రం 'తుఫాన్'. విజయ్ మిల్టన్ దర్శకత్వంలో కమల్‌బోరా, డి.లలితా, బి.ప్రదీప్, పంకజ్ బోరా నిర్మిస్తున్నారు. శనివారం సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఇందులో పోలీసుల నుంచి తప్పించుకు తిరుగుతున్న హీరో గతమేంటి అనే ఆలోచనను ప్రేక్షకుల్లో రేకెత్తించారు. ఇది హీరో గతంతో ముడిపడిన కథ అని ట్రైలర్ ద్వారా అర్థమవుతోంది. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్ కేఎల్, సంగీతం: అచ్చు రాజమణి, విజయ్ ఆంటోని.

స్టార్‌డమ్ పేరుతో బందీ కాలేను



తమన్నా

దక్షిణాది అగ్ర హీరోలందరి సరసన కథానాయికగా అలరించిన తమన్నా ఇప్పుడు ప్రత్యేక గీతాల్లోనూ ఆడి పాడుతున్నారు. అలాగే ఓటీటీలో వెబ్ సిరీస్‌లు చేస్తున్నారు. నెగెటివ్ పాత్రలకు సైతం సై అంటున్నారు. దీంతో హీరోయిన్‌గా స్టార్‌డమ్ తగ్గడంతోనే తమన్నా ఐటమ్ సాంగ్స్ చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే తమన్నా మాత్రం వాటిని కొట్టిపారేస్తున్నారు. ఎప్పుడూ ఒకే తరహా పాత్రలు చేయడం తన వల్ల కాదన్నారు. అందుకే కొత్త తరహా పాత్రలు ప్రయత్నిస్తున్నానని చెప్పారు. కరోనా తర్వాత ప్రేక్షకుల అభిరుచిలో వచ్చిన మార్పుకు అనుగుణంగా కథలు, పాత్రలు ఎంచుకుంటున్నానని తెలిపారు. "మేస్ట్రో' చిత్రంలో నెగెటివ్ రోల్ చేశాను. ఆ పాత్ర బాగా పండింది. ఆ తర్వాత అలాంటి అవకాశాలు మరిన్ని నన్ను వెతుక్కుంటూ వచ్చాయి. కానీ వాటికి నో చెప్పాను. ఇప్పుడు నటిగా నాలోనూ పరిణతి వచ్చింది. స్టార్‌డమ్ పేరుతో బందీగా ఉండలేను. హీరోకు జోడీగా నటించడం అనేది నాకున్న ఎంపికల్లో ఒకటి మాత్రమే అని గుర్తుంచుకోవాలి. వెబ్ సిరీస్‌లు చేసినా, ప్రత్యేక గీతాల్లో నర్తించినా ప్రేక్షకులకు ఇంకా ఏదో కొత్తదనం అందించాలనేదే నా ప్రయత్నం' అని తమన్నా అన్నారు.

'కూర్మావతారం' ఆధారంగా...



వరలక్ష్మీ శరత్‌కుమార్, సాయికుమార్, శివాజీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కూర్మనాయకి'. హర్షవర్ధన్ కడియాల దర్శకత్వంలో కె.విజితా రావు నిర్మిస్తున్నారు. శనివారం శివాజీ పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం ఓ స్పెషల్ వీడియోను రిలీజ్ చేసింది. మహావిష్ణు అవతారాల్లోని 'కూర్మావతారం' ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం త్వరలోనే విడుదలవుతుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: చోటా.కె.ప్రసాద్, సినిమాటోగ్రఫీ: రామ్, సంగీతం: శేఖర్‌చంద్ర.



'జై బోలో తెలంగాణా, హితుడు' లాంటి పలు తెలుగు చిత్రాల్లో కథానాయికగా నటించిన మీరానందన్ మూడు ముళ్ల బంధంలోకి అడుగుపెట్టారు. యూకేకు చెందిన చార్టెడ్ అకౌంటెంట్ శ్రీజును ఆమె పెళ్లాడారు. శనివారం గురువాయుర్‌లో వీరి వివాహం ఘనంగా జరిగింది. ఆ ఫొటోలను మీరానందన్ సోషల్ మీడియాలో షేర్ చేశారు.

ఆశా పాదాలు కడిగిన సోనూ నిగమ్



బాలీవుడ్ చిత్రసీమలో దశాబ్దాలుగా ప్రేక్షకులను అలరిస్తున్న మధుర గాయని ఆశా భోంస్లే. ఆ గానమాధుర్యానికి ఎన్నో పురస్కారాలు వశమయ్యాయి. ఆమె సంగీత ప్రయాణం 'స్వరస్వామిని ఆశ' పేరుతో పుస్తకరూపంలోకి వచ్చింది. ఇటీవలే ముంబైలో జరిగిన ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆసక్తికర సంఘటన జరిగింది. ప్రముఖ గాయకుడు సోనూ నిగమ్ ఆశా పాదాలను కడిగారు. ఆమె పట్ల తనకున్న ప్రేమ, గౌరవాలను అలా చాటుకున్నారు. 'ఆశాజీ నుంచి చాలా నేర్చుకున్నాను. అందుకే ఆమెకు ఈ విధంగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను' అని సోనూ నిగమ్ చెప్పారు.

నవ్య 'దృశ్యం' పేజీలో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/rRRLwqX లో చదవండి.


కేసులు పరిశీలిస్తున్న న్యాయాధికారి శ్రీనివాసులు

లోక్ అదాలత్‌లో 123 కేసులు పరిష్కారం

తెనాలి క్రైం, జూన్ 29 : పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 123 కేసులు పరిష్కరించినట్లు 11వ అదనపు జిల్లా న్యాయాధికారి, మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ డి.శ్రీనివాసులు తెలిపారు. పరిష్కారమైన కేసుల్లో 73 క్రిమినల్ కేసులు, ఏడు మోటారు ప్రమాద కేసులు, 33 సివిల్ కేసులు, 11 ప్రీ లిటిగేషన్ కేసులు ఉన్నాయన్నారు. సుమారు రూ.3 కోట్ల మేరా కక్షిదారులకు మేలు జరిగిందని తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో న్యాయాధికారులు ఎం.శ్రీధర్, పవన్‌కుమార్, పి.రాజశేఖర్‌లతో పాటు మెంబర్లుగా న్యాయవాదులు ప్రభావతి, ఎ.కిషోర్, ఖాదర్ హుస్సేన్, దయాకిరణ్‌లు వ్యవహరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళం ప్రభాకర్, సీనియర్, జూనియర్ లాయర్లు పాల్గొన్నారు.

పొన్నూరుటౌన్: లోక్ అదాలత్‌ల ద్వారా సత్వర న్యాయం అందిస్తున్నట్లు మండల లీగల్ సెల్ ఆథారిటీ ఛైర్మన్, మెజిస్ట్రేట్ ఎం.అంజని ప్రియదర్శిణి అన్నారు. స్థానిక సివిల్ కోర్టులో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 44 కేసులు పరిష్కారమైయ్యాయి. 7 సివిల్ కేసులు, 27 ప్రిలిటిగెంట్ కేసులు, బ్యాంక్ సంబంధించిన 6 కేసులు పలు ఇతర కేసులను పరిష్కరించారు. రూ. 33.45 లక్షల విలువైన సివిల్ కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో కక్షిదారులు న్యాయవాదులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మలేరియా రహిత సమాజాన్ని నిర్మిద్దాం

● పట్టణ సహాయ మలేరియా అధికారి ప్రభాకరరెడ్డి

తెనాలి, మారీసుపేట జూన్ 21 : మలేరియా రహిత సమాజాన్ని నిర్మిద్దామని పట్టణ సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి అన్నారు. స్థానిక సుల్తానాబాదులో శనివారం మలేరియా, ఫైలేరియా సిబ్బందితో మలేరియా మాసోత్సవ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ.. మనదేశంలో 2027వ సంవత్సరానికి మలేరియా కేసులు లేకుండా చేయాలని, 2030 నాటికి పూర్తిగా మలేరియా రహిత సమాజం ఏర్పడాలన్న లక్ష్యంతో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. దోమలద్వారా వ్యాపించే వ్యాధులైన మలేరియా, డెంగ్యు, చికున్ గున్య, మెదడువాపు వ్యాధుల లక్షణాలను వివరించారు. అనంతరం మాసోత్సవ ముగింపు అవగాహన ర్యాలీని నిర్వహించి, మానవ హారాన్ని నిర్మించారు. ఈ సందర్భంఆ మలేరియా అవగాహన కరపత్రాలను పంపిణీచేశారు. కార్యక్రమంలో పట్టణ మలేరియా సబ్‌యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, వంగల పున్నారెడ్డి, ఆరోగ్య పర్యవేక్షకులు దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వరావు, శివరామప్రసాద్, ఆరోగ్య కార్యకర్తలు మున్నంగి రత్నాకరరావు, షేక్ బాషిత్, షేక్ రషీద్, ఆరోగ్య కార్యకర్తలు, మార్తా గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కుబడి తీర్చుకున్న టీడీపీ నాయకులు

పొన్నూరుటౌన్, జూన్29: పొన్నూరు ఎమ్మెల్యేగా ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ విజయం సాధించిన నేపథ్యంలో శనివారం టీడీపీ నిడుబ్రోలు నేతలు గుణదల మేరీ మాత ఆలయం వద్ద మొక్కు తీర్చుకున్నారు. ఉదయం నిడుబ్రోలు టీడీపీ అధ్యక్షుడు జాగర్లమూడి సుధీర్ బాబు ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో టీడీపీ శ్రేణులు విజయవాడ గుణదల తరళివెళ్లారు. మేరి మాత ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్ని, అనంతరం మొక్కు తీర్చుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు సుఖవాసి సుధీర్, పొన్నగంటి వాసు, చల్లాపల్లి సోభరాజ్, కర్ర మహేష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

డీజీపీని కలిసిన మా ఏపీ ప్రతినిధులు

తెనాలి అర్బన్, జూన్ 29 : నూతన డిజిపి ద్వారకా తిరుమలరావును మా ఏపీ ప్రతినిధులు శనివారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మా ఏపీ తరుపున ఆయనకు శుభాకాంక్షలు అందజేశామని సినీ దర్శకుడు దిలీప్‌రాజా విలేకర్లకు తెలిపారు. మా ఏపీ కార్యక్రమాలను, చిత్ర నిర్మాణాలను డిజిపికి వివరించామని చెప్పారు. మా ఏపీ కార్యాలయాన్ని సందర్శించాలని కోరినట్లు తెలిపారు. మిలటరీ ప్రసాద్, అమీర్, వెంకి రావన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

కొల్లిపర, జూన్ 29 : గర్భిణీలు ఆరోగ్య సూత్రాలను తప్పని సరిగా పాటించాలని మండల వైద్యాధికారి వేముల ప్రియాంక అన్నారు. శనివారం మండల పరిధిలోని మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ గర్భిణులు పోషక విలువైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయించు కోవడం మంచిదన్నారు. గర్భిణులు వ్యాధినిరోధక టీకాలను నిర్ధీత సమయంలో తప్పకుండా వేయించు కోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ విజిటర్ కొండమ్మ, జే.శ్రీనివాసరావు, అన్నపూర్ణ, ప్రశాంతి, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


రాఘవేంద్రరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఆలపాటి

విలువలతో జీవించిన వ్యక్తి పరుచూరి

● మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్

తెనాలి అర్బన్, జూన్ 29 : అరవింద ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు పరుచూరి రాఘవేంద్రరావు విలువలతో జీవించారని, అందరికి ఆదర్శవంతంగా నిలిచారని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. నాజరుపేటలోని అరవింద విద్యా కేంద్రంలో శనివారం డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి అధ్యక్షతన రాఘవేంద్రరావు సంస్మరణసభ నిర్వహించారు. హాజరైన పలువురు ముందుగా రాఘవేంద్రరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆలపాటి మాట్లాడుతూ.. రాఘవేంద్రరావు విద్యా కేంద్రం అభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. గతంలో తురుమెళ్ల కళాశాలలో అధ్యాపకుడిగా ప్రిన్సిపాల్‌గా సేవలు అందించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ సంపూర్ణ, నగరాజకుమారి, రాంబాబు, ఉమామహేశ్వరరావు, సత్యనారాయణ, పవన్, మోహన్, శైలజ, పద్మశ్రీ, నాగమల్లేశ్వరి, నిర్మలకుమారి పాల్గొన్నారు.

కేంద్ర సహాయ మంత్రిగా స్వగ్రామానికి పెమ్మసాని


పెమ్మసానికి గజమాలతో స్వాగతం పలుకుతున్న మురళి, నాగభూషణం

- అడుగడుగున ఘన స్వాగతం
- అంగలకుదరులో గజమాలతో సత్కారం
- జన నీరాజనం మధ్య బుర్రిపాలెంకు..
- ఎన్టీఆర్, తండ్రి సాంబశివరావు విగ్రహాలకు నివాళులు

తెనాలి రూరల్, జూన్ 29: గ్రామీణాభివృద్ధి, కమ్యునికేషన్ శాఖ కేంద్ర సహాయమంత్రిగా డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం తన స్వగ్రామం బుర్రిపాలెంనకు విచ్చేశారు. ఆయనకు తెనాలి నియోజవర్గంలోని సంగంజాగర్లమూడి నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. మండలంలోని అంగలకుదరు గ్రామ సెంటర్‌లో గ్రామ పార్టీ ఆధ్వర్యంలో పెమ్మసానిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గణేష్‌యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నాయకులు వీరవల్లి మురళి, కనగాల నాగభూషణంల ఆధ్వర్యంలో పెమ్మసాని చంద్రశేఖర్‌కు గజమాలతో స్వాగతం పలికి దుశాలువాలతో సత్కరించారు. అనంతరం తెనాలి శివాజీ చౌక్‌లో కాళీమాత దేవస్థానంలో అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ నుంచి యడ్లపాటి వెంకట్రావు సెంటర్ వద్దకు వెళ్లి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. బుర్రిపాలెం సమీపంలో చంద్రశేఖర్ తండ్రి సాంబశివరావు కాంస్య విగ్రహానికి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు తెనాలిలో డంపింగ్‌యార్డు నుంచి ఉత్పన్నమవుతున్న సమస్యలను, బుర్రిపాలెం గ్రామ సమీప పంటపొలాలకు వెళ్లేందుకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పెమ్మసాని దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన చంద్రశేఖర్ రైతులతో కలిసి నేరుగా సమస్య ఉన్న ప్రాంతానికి వెళ్లి పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దారిపొడవునా పెమ్మసానికి శుభాకాంక్షలు చెప్పేందుకు మహిళలు, పార్టీ శ్రేణులు, విద్యార్థిని విద్యార్థులు, అభిమానులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

ట్రాఫిక్ అంతరాయం లేకుండా బుర్రిపాలెంకు..

కేంద్ర సహాయ మంత్రిగా తొలిసారిగా బుర్రిపాలెం విచ్చేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్‌కు ఘన స్వాగతం పలికారు. కాగా పార్టీ నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఎక్కడికక్కడ పెమ్మసానిని కలిసి శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చారు. కాగా సాయంత్ర సమయం కావడంతో పాఠశాలలు, కార్యాలయాల నుంచి ఇంటికి వెళ్లేవారు వాహనాలతో వస్తుంటారని, తాను ఎక్కువ సమయం రోడ్డుపై ఉండటం ద్వారా ట్రాఫిక్ నిలిచిపోయి వారంతా ఇబ్బందులు ఎదుర్కొంటారని సున్నితంగా ప్రజలకు అభిమానులకు తెలిపి అతి స్వల్ప సమయంలోనే దారి పొడవునా అశేష ప్రజానీకానికి అభివాదం తెలుపుతూ బుర్రిపాలెం చేరుకున్నారు.

రైల్వేట్రాక్ సమస్య పరిష్కరిస్తే రైతులకు మేలు జరుగుతుంది

బుర్రిపాలెం - యడవర్రు రోడ్డులోని తెనాలి - అనంతవరం - జంపని వద్ద లెవల్ క్రాసింగ్ రైల్వే గేటును మూసివేయడం వల్ల ఇక్కట్లు పాలవుతున్నామని స్థానిక రైతులు, ప్రజలు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు విన్నవించారు. కేంద్రసహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా స్వగ్రామం బుర్రిపాలెం వస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్‌ను పలువురు రైతులు కలిసి లెవల్ క్రాసింగ్ రైల్వేగేటు మూయడం వల్ల కలుగుతున్న ఇబ్బందులపై పెమ్మసాని చంద్రశేఖర్‌కు వివరించారు. స్పందించిన పెమ్మసాని రైతులతో కలిసి నేరుగా సమస్యఉన్న ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. ఈ దారిని మూసివేయడం ద్వారా చుట్టూ తిరిగి పెదరావూరు మీదుగా దాదాపుగా 14కిలీమీటర్ల మేర ప్రయాణించాల్సి వస్తుందని రైతులు పెమ్మసాని ఎదుట వాపోయారు. పెమ్మసాని చంద్రశేఖర్ స్పందిస్తూ సంబంధిత రైల్వే అధికారులతో ఫోన్లో మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఆ గేటును తొలగించడం లేదా ప్రయాణాలకు అనువుగా ప్రత్యామ్నాయ మార్గాలకు అవకాశం కల్పించాలని అధికారులకు సూచించారు. దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని పెమ్మసానికి అధికారులు వివరించారు.


సమస్య ప్రాంతాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న పెమ్మసాని

ఇళ్లు లేని పేదలుండకూడదన్నదే నా లక్ష్యం

● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్


సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

తెనాలి రూరల్, జూన్ 29: రాష్ట్రంలో ఇళ్లలేని పేదలుండకూడదన్న లక్ష్యంతోనే తాను పనిచేస్తున్నట్లు గ్రామాణాభివృద్ధి, కమ్యునికేషన్ శాఖ కేంద్ర సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. కేంద్ర సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా ఆయన స్వగ్రామం బుర్రిపాలెంకు శనివారం విచ్చేశారు. గ్రామంలోని నటశేఖరుడు ఘట్టమనేని కృష్ణ కాంస్యవిగ్రహానికి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పెమ్మసాని మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో ప్రజలకు చెప్పిన మాట ప్రకారం ఎక్కడా కూడా అవినీతికి తావులేకుండా తన బాధ్యతలను నిర్వర్తిస్తానని చెప్పారు. దేశంలో కరప్షన్ పోయేవిధంగా అవినీతి రాజకీయ నాయకుల చిట్టా అతి త్వరలోనే తీయబోతున్నామన్నారు. గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించి వారి జీవన విధానాల్లో గొప్ప మార్పు తీసుకురాబోతున్నామన్నారు. ప్రతి గ్రామంలో పరిశుభ్రమైన మంచినీరు, శానిటేషన్, వైద్యం, పేదలకు అవసరమైన గృహాలు నిర్మించడం వంటివి చేపట్టడం జరుగుతుందన్నారు. తన ప్రతి అడుగు పేదల అభ్యున్నతికేనని ఆయన స్పష్టం చేశారు. తనపై ఎంతో నమ్మకంతో ఇంతటి ఘన విజయాన్ని అందించిన ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలను ఆదరించాలి

చేబ్రోలు, జూన్29 : ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను సమకూరుస్తున్నందున ప్రభుత్వ పాఠశాలలను ఆదరించాలని మండల విద్యాశాఖ అధికారి రాయల సుబ్బారావు అన్నారు. మండల పరిధిలోని శేకూరు ఉన్నతపాఠశాల, ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో శనివారం 'నేను బడికి పోతా..' కార్యక్రమాన్ని నిర్వహించారు 6 నుంచి 14 ఏళ్ల లోపు వారిని బడిలో చేరాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 2వ ఏంఈవో ఏవీ హెచ్ ప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ ప్రసాద్, జోసఫ్ సుధీర్ బాబు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

ఐటీఐలో రెండో విడత ప్రవేశాలకు ఆహ్వానం

తెనాలి అర్బన్, జూన్ 29 : జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ ఐటిఐలలో రెండో విడత ఐటీఐ ప్రవేశాలకు అభ్యర్థులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని ప్రిన్సిపల్ రావి చినవెంకటేశ్వర్లు తెలిపారు. జూలై 24 లోగా పేర్లను ఐటిఐ వెబ్‌సైట్ నమోదు చేసుకోవాలని లేదా ప్రభుత్వ ఐటిఐలలో ఉన్న నమోదు కేంద్రాలను వినియోగించుకోవాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో నమోదు కేంద్రాలలో వెరిఫికేషన్ చేయించుకున్న అభ్యర్థులు జూలై 27,28 తేదీల్లో ప్రభుత్వ ఐటీఐలలో జరిగే కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని, 29, 30 తేదీల్లో ప్రైవేట్ ఐటిఐలలో కౌన్సిలింగ్‌కు హాజరు కావాలన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణత పొందని విద్యార్థులు వెల్డర్ ట్రేడ్‌లో చేరవచ్చని తెలిపారు.

విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు


తెనాలి అర్బన్, జూన్ 29 : ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఎన్ఆర్‌కే అండ్ కేఎస్ఆర్ గుప్తా కళాశాలలో శనివారం క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారు. దేవేశి రిక్రూట్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ, హెచ్ఆర్, బిజినెస్ ఎగ్జిక్యూటివ్‌లకు ఇంటర్వ్యూలు నిర్వహించిందని ప్రిన్సిపాల్ విజయకృష్ణ తెలిపారు. డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులు 11 మంది ఉద్యోగాలు సాధించారన్నారు. వీరికి సంవత్సరానికి రూ.2 లక్షల వేతనంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పిస్తారని తెలిపారు. సంస్థ ప్రతినిధులు చంద్రశేఖర్, రాము ఎంపికలను నిర్వహించగా మేనేజర్ శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైభవంగా శాంతి హోమాలు

తెనాలి, మారీసుపేట జూన్ 29: స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠంలో సాలిగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి) స్వయం పర్యవేక్షణలో శనివారం శ్రీనవగ్రహ సహిత శ్రీనక్షత్ర సంపూర్ణ శాంతి హోమ పూజలను, స్వామివారికి ప్రత్యేక అభిషేకాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

విద్యుత్ బిల్లులు చెల్లించాలి

తెనాలి అర్బన్, జూన్ 29 : డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు విద్యుత్ బిల్లులు చెల్లించాలని ట్రాన్స్ కో ఈఈ చిరంజీవి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం కూడా అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల వద్ద బిల్లులు చెల్లించే అవకాశం ఉందన్నాని ఈఈ చిరంజీవి తెలిపారు.


సర్టిఫికెట్లను చూపుతున్న చైర్మన్ విద్యాసాగర్

ఎన్‌పీటీఈఎల్ ఫలితాలలో
వీవీఐటీ విద్యార్థుల ప్రతిభ

పెదకాకాని, జూన్ 29: భారత ప్రభుత్వం సాంకేతిక విద్య పురోగాభివృద్ధి కోసం అంతర్జాలంలో శిక్షణ ఇచ్చి నిర్వహించు ఎన్‌పీటీఈఎల్ (నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ టెక్నాలజీ ఎనా న్స్మెంట్ లెర్నింగ్) పరీక్షలో వీవీఐటీ విద్యార్థులు, అధ్యాపకులు ఉత్తమ ప్రదర్శన చూపి సర్టిఫికెట్లు పొందినట్లు కళాశాల ఛైర్మెన్ వాసిరెడ్డి విద్యాసాగర్ శనివారం తెలిపారు. ఈ పరీక్షలో ఉత్తమ ప్రదర్శన కనబరచిన 61 మంది కంట్రీ టాపర్‌లుగా నిలవగా, 1592 మంది వీవీఐటీ విద్యార్థులు, 16మంది అధ్యాపకులు సర్టిఫికెట్లు పొందారన్నారు. ప్రస్తుతం అందుబాటులో వున్న సిలబస్‌తో పాటు అధునిక సాంకేతిక కోర్సుల్లో విద్యార్థులు శిక్షణ పొందటం వలన సాంకేతికతనందు మెరుగైన ఫలితాలు పొందవచ్చని అన్నారు. సర్టిఫెకెట్లు పొందిన విద్యార్థులను, అధ్యాపకులను వైస్ ఛైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపాల్ వై. మల్లికార్జునరెడ్డి, జాయింట్ సెక్రటరీ మామిళ్లపల్లి శ్రీకృష్ణ, ఎన్.పి.టి.ఈ.ఎల్ సంధానకర్త కేదార్ మల్లిక్ తదితరులు అభినందించారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

సురక్షిత నీరు అందించటమే ప్రథమ లక్ష్యం

● పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

పొన్నూరుటౌన్, జూన్ 29 : పట్టణ ప్రజలకు సురక్షితమైన తాగు నీరు అందించటమే తమ ముందున్న ప్రథమ లక్ష్యమని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని నిడుబ్రోలు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నీటి శుద్ధికి ఉపయోగించే క్యారీఫయిర్లు పనిచేయకపోవటంపై ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నించారు. అలాగే నీటి శుద్ధి కోసం ఉపయోగించే ఆలం వివరాలను అధికారులు చెప్పలేక పోయారు. ఆలం కోసం వినియోగించే, నీటి నాణ్యతను పరీక్షించే యంత్రాలు ఏవీ వినియోగంలో లేవు. దీనిపై ప్రశ్నించగా అధికారులు సమాధానం చెప్పలేక సిబ్బందిపై నెపం నెట్టే ప్రయత్నం చేసారు. ప్లాంట్ నిర్వహణ పర్యవేక్షణ అధికారి ఎవ్వరు లేకపోవటంతో ప్లాంట్‌లో పనిచేసే కాంట్రాక్ట్ వర్కర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేసారు. తక్షణమే ఒక పర్యవేక్షణ అధికారిని నియమించి ప్లాంట్ నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అలాగే ఐదేళ్ల కాలంగా ప్లాంట్‌లో చెప్పట్టిన మరమ్మతులు, కొన్నుగోలు చేసిన యంత్రాలు, ఆలం, క్లోరిన్ సంబంధించిన వివరాలు అందచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం డయేరియా ప్రబలుతున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి సురక్షితమైన తాగు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

తెనాలి కౌన్సిల్లో ధూం..ధాం..

- వైసీపీ కౌన్సిలర్లు కమిషనర్‌ల మధ్య వాగ్వివాదం
- చర్చలేకుండా ఎజెండాల ఆమోదం.. టీడీపీ కౌన్సిలర్‌ల నిరసన

తెనాలి(మారీసుపేట),జూన్ 29: 'వైఎస్ విగ్రహం నిర్మాణం కోసం మున్సిపల్ నిధులు రూ. 25 లక్షలు ఖర్చు చెయ్యాల్సిన అవసరం ఏమొచ్చింది? నిధులన్నీ మీ సొంతానికి వాడుకోవటం మినహా ఒక్క అభివృద్ధి పని చేయలేదు. అందుకే ప్రజలు మిమ్మల్ని ఇంటికి పంపించింది' అంటూ టీడీపీ కౌన్సిలర్‌లు ధ్వజమెత్తారు. వైసీపీ, టీడీపీ కౌన్సిలర్‌ల వాదనలు, ప్రతివాదనలు, అరుపులతో తెనాలి కౌన్సిల్ దద్దరిల్లింది. టీడీపీ సభ్యుల వాక్‌దాడిని తట్టుకోలేక చివరకు ఎజెండా అంశాలపై చర్చలేకుండానే ఆమోదించినట్టు ప్రకటించేసి బయటకు జారుకోవటం కొసమెరుపు. దీనిపైనా టీడీపీ సభ్యులు మండిపడుతూ ఛైర్‌పర్సన్ పోడియం దగ్గర నిరసనకు దిగటం మరింత వేడిని పెంచింది. తెనాలి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన జరిగింది. సమావేశం ప్రారంభంలోనే 25వ వార్డు వైసీపీ కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య, ఛైర్‌పర్సన్ రాధికలు పలు అభివృద్ధి పనులపై తమకు సమాచారం ఉండటం లేదని, దీనిపై మున్సిపల్ కమిషనర్ సమాదానం చెప్పాలని కోరారు. కమిషనర్ స్పందిస్తూ తాము రాష్ట్ర మంత్రి ఆదేశాల మేరకు చేస్తున్నామని, ఛైర్‌పర్సన్‌కూ తెలియచేశామని చెప్పడంతో, 'నాకు ఎప్పుడు చెప్పారు' అంటూ ఛైర్‌పర్సన్ ఆయనను ప్రశ్నిచారు. ఇలా ప్రోటోకాల్ అంశంపై సభలో వాదప్రతివాదనలు సాగాయి. టీడీపీ కౌన్సిరల్ యుగంధర్ జోక్యం చేసుకుంటూ... గతంలో వైసీపీ ప్రభుత్వంలోనూ పరిస్థితి ఇంతకంటే ఘోరంగా ఉండేదంటూ వైసీపీ కౌన్సిరల్‌లకు బదులిచ్చారు. అనంతరం రెండవ అంశం చదివి అమోదించగానే టీడీపీ కౌన్సిలర్ త్రిమూర్తి మున్సిపల్ నిధుల దుర్వినియోగంపై ప్రశ్నించారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన 'ప్రజాధనం... పక్కదారి' అనే శీర్షికతో కదనాన్ని సభకు చూపించి దీనికి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రణరంగ చౌక్‌లో రూ. 25 లక్షలతో పార్కు అభివృద్ది చేస్తున్నామనిచెప్పి, అక్కడ పార్కు అభివృద్ధి పనులు కాక వైఎస్ విగ్రహానికి గ్రానైట్ రాళ్లతో ఆర్భాటాలు చేస్తున్నారని, మున్సిపల్ నిధులను దుర్వినియోగం చేయటమేంటని నిలదీశారు. కమిషనర్ సమాధానమిస్తూ రికార్డులను పరిశీలించి తరుపరి సమావేశంలో అందజేస్తానని తెలిపారు. ఇదే అంశంపై పలువురు వైసీపీ సభ్యులు, టీడీపీ సభ్యులతో వాదనకు దిగడంతో సభలో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ఛైర్‌పర్సన్ రాధిక ఎజెండాలోని మిగిలిన 25 అంశాలను చర్చించకుండా ఆమెదించినట్లు ప్రకటించటంతో టీడీపీ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ సభ్యులు ఛైర్‌పర్సన్ పోడియం ముందు కూర్చుని నిరసనలు తెలిపారు. నిరసన కార్యక్రమం జరుగుతుండగానే వైసీపీ సభ్యులు ఒక్కొక్కరుగా వెళ్లిపోయారు. కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు అధికారులు పాల్గొన్నారు.


ఛైర్‌పర్సన్ పోడియం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ కౌన్సిలర్లు